


నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

కర్నూలు నంద్యాల

శుక్రవారం | 09 మే 2025

పేజీలు 8






హత్యకు గురైన చెరుకులపాడు నారాయణరెడ్డి (ఫైల్‌ఫోటో)



చెరుకులపాడు నారాయణరెడ్డి హత్యకు గురైనప్పుడు దృశ్యం (ఫైల్‌ఫోటో)

యావజ్జీవ కారాగార శిక్ష పడిన ముద్దాయిలు

- ఐదు మందిని నిర్దోషులుగా విడుదల చేసిన జిల్లా కోర్టు
- కోర్టు ఆదేశాలతో గతంలోనే కె.ఇ శ్యాంబాబు, కప్పట్రాళ్ళ బొజ్జమ్మ పేర్లు తొలగింపు
- 2017లో నారాయణరెడ్డిని,ఆయన అనుచరుడిని హత్య చేసిన ప్రత్యర్థులు
- న్యాయం జరిగిందన్న మాజీ ఎమ్మెల్యే చెరుకులపాడు శ్రీదేవి
- కోర్టు వద్ద విషాదం..శిక్షపడ్డ వారిని జైలుకు తరలించిన పోలీసులు
- సంబంధం లేని తనను కేసులో ఇరికించారంటూ తలబద్దలు కొట్టుకోపోయిన వ్యక్తి
- సంచలన తీర్పు చెప్పిన జిల్లా జడ్జి కబర్ది

## చెరుకులపాడు హత్య కేసులో

# 11 మందికి యావజ్జీవ శిక్ష

కర్నూలు/వెల్దుర్తి/కల్లూరు, మేజర్‌న్యూస్‌బ్యూరో :

రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన వైకాపా నాయకుడు చెరుకులపాడు నారాయణరెడ్డి, ఆయన అనుచరుడు సాంబశివుడు హత్య కేసులో 11మందికి యావజ్జీవ శిక్ష విధిస్తూ జిల్లా జడ్జి కబర్ది సంచలన తీర్పు ఇచ్చారు. ఈ కేసులో నిందితులుగా ఉన్న ఐదు మందిని నిర్దోషులుగా విడుదల చేశారు. మరో నలుగురి పేర్లను ఎఫ్ఐఆర్ నమోదైన తర్వాత కోర్టు ఆదేశాలతో తొలగించారు. ఈ మేరకు గురువారం కర్నూలు జిల్లా కోర్టు తీర్పు వెలువరించింది. ఇటీవలి కాలంలో ఒక్కసారిగా ఇంత పెద్ద సంఖ్యలో యావజ్జీవ శిక్షలు విధిస్తూ వెలువరించిన తీర్పులు లేకపోవడంతో ఈ తీర్పు రాష్ట్ర వ్యాప్తంగా సంచలనంగా మారింది. ఎనిమిది సంవత్సరాల సుదీర్ఘ వాదోవాదనల అనంతరం కోర్టు తీర్పు వెలువరించింది. నారాయణరెడ్డి హత్యలో భాగస్వాములయ్యారంటూ ప్రస్తుత పత్తికొండ ఎమ్మెల్యే కెఇ శ్యాంబాబు, కప్పట్రాళ్ల బొజ్జమ్మ, మరో ఇద్దరి పేర్లను పోలీసులు ఎఫ్ఐఆర్‌లో చేర్చగా వారి పేర్లను తొలగించాలని అప్పట్లోనే కోర్టు ఆదేశాలిచ్చింది. మిగతా 2లో



యావజ్జీవ కారాగార శిక్ష పడిన వారిని వాహనంలో జైలుకు తరలిస్తున్న దృశ్యం





యావజ్జీవ కారాగార శిక్ష పడిన ముద్దాయిల కుటుంబ సభ్యులు రోధిస్తున్న దృశ్యాలు

## అత్యుత్తమ సేవలకు

# పురస్కారం

**రెడ్‌క్రాస్ అవార్డు అందుకున్న కర్నూలు జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా**



గవర్నర్ చేతుల మీదుగా పురస్కారం అందుకుంటున్న కలెక్టర్ రంజిత్ బాషా

**కర్నూలు, మేజర్‌న్యూస్ ప్రతినిధి :** రెడ్ క్రాస్ సొసైటీ ద్వారా అత్యుత్తమ సేవలకు గుర్తింపుగా జిల్లా కలెక్టర్ పి రంజిత్ బాషాకు పురస్కారం లభించింది. గురువారం విజయవాడ లోని రాజ్ భవన్‌లో రాష్ట్ర గవర్నర్ ఇండియన్ రెడ్ క్రాస్‌సొసైటీ ఏపి స్టేట్ బ్రాంచ్ ప్రెసిడెంట్ అబ్దుల్ నజీర్ చేతుల మీదుగా పురస్కారం అందుకున్నారు. మిగతా 2లో

# రింగు రోడ్డు వద్ద భారీ గొయ్యి

- బ్రిడ్జి కూలిందని పుకార్లు షికార్లు

**కర్నూలు క్రైం, మేజర్‌న్యూస్ :** రింగు రోడ్డు వద్ద భారీ గొయ్యి వర్షాల వల్ల పడిందా..లేక బ్రిడ్జి కుంగిపోయి పడిందా..? అన్నది తెలియక నగర ప్రజలు అయోమయానికి గురయ్యారు. వివరాల్లోకి వెళితే తాలుక పోలీస్‌స్టేషన్ పరిధిలోని రింగు రోడ్డు వద్ద గురువారం భారీగొయ్యి ఏర్పడింది. దీంతో కొందరు బ్రిడ్జి కూలి గొయ్యి పడిందని పుకార్లు పుట్టించారు. దీనిని గమనించిన తాలుక సిఐ శ్రీధర్ రంగంలోకి దిగి గత కొన్ని రోజులుగా కురుస్తున్న అకాల వర్షాలకు మిస్టర్ ఇడ్లీ హోటల్ ప్రాంతం మిగతా 2లో



భారీగా గొయ్యి ఏర్పడిన దృశ్యం

## ఉత్తమం..అత్యుత్తమం రెడ్ క్రాస్‌కు

# ఆమె సేవలు రాజసం

- నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారికి గవర్నర్ అవార్డు..బంగారు పతకం
- నంద్యాల జిల్లాకే వన్నెతెచ్చిన కలెక్టర్ రాజకుమారి గణియా

**నంద్యాల కల్చరల్, మేజర్‌న్యూస్ :** ఆమె దరహాసం రాజసం...చిన్న నవ్వుతో అందరిని ఆకట్టుకుంటూ వచ్చిన వారిని ఆప్యాయంగా పలకరిస్తూ వారి సమస్యలను తెలుసుకుంటూ అందరి మన్ననలు పొందుతూ జిల్లా రెండో కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి ప్రజలకు అత్యుత్తమ సేవలందిస్తూ... మరో వైపు రెడ్‌క్రాస్ ఉద్యమానికి ఊపిరి పోసి సంస్థ అభివృద్ధికి విశేష సేవలందిస్తూ మిగతా 2లో



గవర్నర్ అబ్దుల్ నజీర్ చేతుల మీదుగా గవర్నర్ అవార్డును అందుకుంటున్న జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా

# చెరుకులపాడు హత్య కేసులో 11 మందికి యావజ్జీవ శిక్ష

(మొదటి పేజి తరువాయి)





దీంతో వారి పేర్లను అప్పట్లోనే తొలగించారు. ఈ హత్య కేసులో మొత్తం 19మందిపై కేసు నమోదు కాగా, 11 మంది యావజ్జీవ శిక్ష ఖరారు కాగా, ఐదు మంది నిర్దోషులుగా విడుదల కాగా, మరో నలుగురి పేర్లను కోర్టు తీర్పుతో గతంలోనే తొలగించారు. 2017 మే 21వతేదీన చెరుకులపాడు నారాయణ రెడ్డి,సాంబశివుడులు హత్యకు గురయ్యారు. యావజ్జీవ శిక్ష పడ్డ వారిలో ఒకరు ఇటీవలే అనారోగ్యంతో మృతి చెందగా, శిక్ష పడ్డ రామాంజనేయులు, రామానాయుడు, రామకృష్ణ, బోయబాలుడు, చిన్నఎల్లప్ప, పెద్ద ఎల్లప్ప, వెంకటరాముడు, శ్రీను, రామాంజనేయులు, పెద్ద బీషన్నలను జైలుకు తరలించారు. ఇదే కేసులో నిందితులైన చాకలి నారాయణ, కురువ పెద్దయ్య, బోయ గిడ్డయ్య, బోయగోపాల్, చిన్నవెంకటేల్‌లను కోర్టు నిర్దోషులుగా విడుదల చేసింది. గురువారం తుది తీర్పు వెలువడుతుందన్న వార్తతో కృష్ణగిరి, దేవనకొండ మండలాలకు చెందిన ప్రజలు పెద్ద ఎత్తున జిల్లా కోర్టుకు తరలి వచ్చారు. దీంతో కోర్టు వద్ద భావోద్వేగ వాతావరణం కనిపించింది. కోర్టు తీర్పు వెలువరించిన వెంటనే శిక్ష పడ్డ వారిని పోలీసులు జైలుకు తరలించే ప్రయత్నంలో ఉండగా కోర్టు వద్ద తీవ్ర విషాదం నెలకొంది. శిక్షపడి తమ వారు జైలుకు వెళుతుండడంతో వారి భార్యలు, వృద్ధ తల్లిదండ్రులు, బంధువుల రోదనలు కోర్టు ఆవరణలో మిన్నంటాయి. మా జీవితాలు వీధిన పడ్డట్లేనంటూ ఆయా కుటుంబాలు వాపోయాయి. తమను ఈ కేసులో అన్యాయం గా ఇరికించారంటూ ఒక వ్యక్తి పోలీ సు వాహనంలోని అద్దానికి తల బాదు కోవడం కనిపించింది. తన భర్తను చంపిన వారికి శిక్ష పడడంతో తన కుటుంబానికి న్యాయం జరిగిందని ఆయన భార్య, పత్తికొండ మాజీ ఎమ్మెల్యే చెరుకుపాడు శ్రీదేవి అన్నారు.

కృష్ణగిరి మండలం చెరుకులపాడు గ్రామానికి చెందిన వైకాపా నేత, ఫ్యాక్షన్ నేత చెరుకులపాడు నారాయణరెడ్డి, ఆయనతో పాటు వాహనంలో ప్రయాణిస్తున్న అనుచరుడు సాంబశివుడిని ప్రత్యర్థులు కాపుకాచి హత్య చేశారు. సరిగ్గా ఎనిమిది సంవత్సరాల క్రితం 2017 సంవత్సరం మే 21వ తేదీన హత్య జరిగింది. బాంబులు, వేటకొడవళ్లు ఉపయోగించి వారిద్దరిని ప్రత్యర్థులు అతి కిరాతకంగా హతమార్చారు. 2014లో కాంగ్రెస్‌పార్టీ టికెట్‌పై పత్తికొండ నియోజకవర్గం నుండి నారాయణరెడ్డి పోటీ చేసి ఓడిపోయారు. 2015లో వైసీపీలో చేరిన ఆయన అప్పటి నుండి వైకాపా పత్తికొండ నియోజకవర్గ ఇంఛార్జ్‌గా ఉన్నారు. అంతకు ముందు ఆయన కాంగ్రెస్‌పార్టీలో కోట్ల కుటుంబానికి ముఖ్య అనుచరుడిగా ఉన్న నారాయణరెడ్డి తర్వాత రాజకీయ పరిణామాల్లో వైసీపీలో చేరారు. చెరుకులపాడు నారాయణరెడ్డి హత్యకు గురవడంతో ఆయన భార్య చెరుకులపాడు శ్రీదేవి క్రియాశీల రాజకీయాల్లోకి వచ్చారు. వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పాదయాత్ర సందర్భంగా పత్తికొండ నియోజకవర్గం నుండి శ్రీదేవ మ్మకు టికెట్ ఇస్తున్నట్లు ప్రకటించారు. 2019లో జరిగిన ఎన్నికల్లో చెరుకులపాడు శ్రీదేవి తిరుగులేని విజయం సాధించారు. 2024లో జరిగిన ఎన్నికల్లో వైసీపీ టికెట్‌పై పోటీ చేసిన ఆమె ఓడిపోయారు. ప్రస్తుతం ఆమె పత్తికొండ నియోజకవర్గ వైకాపా ఇంఛార్జ్‌గా ఉన్నారు.

**న్యాయం జరిగింది : మాజీ ఎమ్మెల్యే శ్రీదేవి :** తన భర్త నారాయణరెడ్డి హత్య కేసులో నిందితులకు యావజ్జీవ శిక్ష పడడంతో న్యాయం జరిగిందని ఆయన భార్య, పత్తికొండ మాజీ ఎమ్మెల్యే చెరుకులపాడు శ్రీదేవి అన్నారు. గురువారం కర్నూలులోని తన నివాసంలో విలేకరులతో ఆమె మాట్లాడారు. తన భర్తను కిరాతకంగా హత్య చేశారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. తన భర్తను హత్య చేసినా తాను ప్రతీకార చర్యలకు దిగలేదని ఆమె గుర్తు చేశారు. ఆయన హత్యకు ప్రతీకారంగా హత్యలు చేయాలన్న ఆలోచన కూడా తనకు రాలేదని ఆమె అన్నారు. చట్టంపై నమ్మకంతో ఉన్నానని ఆమె చెప్పారు. శిక్షలు పడ్డ వారి కుటుంబాలు తమ వారిని జైళ్లనోనైనా కలుసుకునే అవకాశం ఉందని, తనకు తన భర్తను కలుసుకునే అవకాశం లేకుండా చేశారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఒకరి మెప్పు కోసం, ఎవరో చెప్పిన మాటలు విని హత్యలు చేసి జీవితాలు నాశనం చేసుకోవద్దని ఆమె హితవు చెప్పారు.



మాజీ ఎమ్మెల్యే శ్రీదేవి

# ఉత్తమం...అత్యుత్తమం రెడ్‌క్రాస్‌కు ఆమె సేవలు రాజసం

(మొదటి పేజి తరువాయి)

అందరి మన్ననలు పొందిన నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా జిల్లాకే వన్నె తెచ్చారనడంలో అతిశయోక్తి లేదు. ఆమె సేవలను గుర్తించిన ప్రభుత్వం గవర్నర్ అవార్డు, బంగారు పతకం అందజేశారు. గురువారం అమరావతిలోని రాజ్‌భవన్‌లో జరిగిన ప్రపంచ రెడ్‌క్రాస్ దినోత్సవం, ప్రపంచ తలసేమియా దినోత్సవ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ గవర్నర్ మరియు ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు అబ్దుల్ నజీర్ ప్రథమ మహిళ సమీరా నజీర్ చేతుల మీదుగా జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా, బంగారు పతకం అందుకున్నారు. రాష్ట్రంలో రెడ్‌క్రాస్ ఉద్యమానికి అత్యుత్తమ సేవలు అందించడంతో పాటు మరియు గరిష్ట సహకారాన్ని సమీకరించినందుకు 8మంది కలెక్టర్లకు గవర్నర్ పతకాలను అందజేశారు. ఇందులో భాగంగా నంద్యాల జిల్లాలో రెడ్‌క్రాస్ అభివృద్ధికి విశేష సేవలు అందించిన నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారికి ప్రతిష్టాత్మకమైన అవార్డును, బంగారు పతకాన్ని గవర్నర్ చేతుల మీదుగా అందుకోవడం జరిగింది.

ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నంద్యాల జిల్లాలో ఇటీవల అధునాతన వసతులతో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ బ్లడ్ స్టోరేజి సెంటర్‌ను ప్రారంభించుకున్నామన్నారు. అలాగే రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో ప్రజలకు అత్యంత తక్కువ ధరకు లభ్యమయ్యేలా జనరిక్ మెడికల్ షాప్‌ను త్వరలో ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. యూత్ బ్లడ్ క్రాస్‌ను బలోపేతం చేసి అత్యవసర పరిస్థితుల్లో సేవలందించేలా రెడ్‌క్రాస్ ఆర్మీని జిల్లా కమిటీ ఆధ్వర్యంలో తయారు చేస్తామన్నారు. మత్స్యకారులకు, చెంచు కుటుంబాలకు కూడా రెడ్‌క్రాస్ సంస్థ ద్వారా మరిన్ని వైద్య సేవలు ఇంటింటికి అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈకార్యక్రమంలో రెడ్‌క్రాస్ రాష్ట్ర చైర్మన్ వై డి రామారావు, కోశాధికారి రామచంద్రరాజు, జనరల్ కార్యదర్శి ఐఎఎస్ ఫరీదా, నంద్యాల చైర్మన్ దస్తగిరి తదితరులు పాల్గొన్నారు. అనంతరం శ్రీకాకుళం జిల్లా రెడ్‌క్రాస్ బ్లడ్ సెంటర్‌లో రెడ్‌క్రాస్ తలసేమియా బ్లడ్ ట్రాన్స్ఫ్యుజన్ సెంటర్‌ను గవర్నర్ రాజ్ భవన్ నుంచి వర్చువల్ మోడ్‌లో ప్రారంభించారు.

# అత్యుత్తమ సేవలకు పురస్కారం

(మొదటి పేజి తరువాయి)



గవర్నర్‌తో ఐఏఎస్‌ల గ్రూప్ ఫోటో

2023-24, 2024-25లో బాపట్ల, కర్నూలు జిల్లాల్లో రెడ్ క్రాస్ సొసైటీ ద్వారా కలెక్టర్ రంజిత్ బాషా అత్యుత్తమ సేవలు అందించారు. అందుకు గాను ఆయనకు ఈ పురస్కారం దక్కింది. ఈ సందర్భంగా కలెక్టర్ రంజిత్ బాషా జిల్లాలలో రెడ్ క్రాస్ ద్వారా రక్తదాన శిబిరాలు, అవయవదాన కార్యక్రమాలు, వైద్య శిబిరాలు, పల్స్ పోలియో, కుష్టు, ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీలను నిర్వహించారు. ఆయన నిర్వహించిన సేవలను ప్రసంశిస్తూ గవర్నర్ అభినందించారు.

# ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు ప్రభుత్వ సహకారం - మంత్రి బి.సి

**బనగానపల్లెమేజర్,న్యూస్‌:** రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టే ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ప్రభుత్వం అన్ని విధాలుగా సహకరిస్తుందని మంత్రి బి.సి జనార్ధన్ రెడ్డి అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నాయకత్వంలో రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు పెట్టుబడిదారులు ఉత్సాహం కనబరుస్తున్నారన్నారు. గురువారంనాడు ఆర్.అండ్.బి శాఖా మంత్రి కార్యాలయంలో బి.సి జనార్ధన్ రెడ్డిని మార్యదపూర్వకంగా బ్లూజె ఎరోస్పేస్ సంస్థ ఫౌండర్ ఉత్తం కో ఫౌండర్ అమర్ కలిసి రాష్ట్రంలోని ఎవియేషన్ రంగంలో కార్గో మరియు పాసింజర్, యూవిటోల్ మ్యానిఫ్యాక్చరింగ్ యూనిట్ స్థాపనకు ఆసక్తి కనబరిచారు. రాష్ట్రంలో ఏవియేషన్ రంగంలో 2000కోట్లకుపైగా పెట్టుబడులు పెట్టేందుకు బ్లూజె ఏరోస్పేస్ సంస్థ ముందుకు వచ్చిందని తెలిపారు.



మంత్రి బి.సిని కలిసిన ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు

# రింగు రోడ్డు వద్ద భారీ గొయ్యి

(మొదటి పేజి తరువాయి)

నుంచి రింగు రోడ్డు వరకు అక్కడక్కడ గుంతలు పడ్డాయని అందులో భాగంగా బ్రిడ్జి పక్కనే ఉన్న సర్వీసు రోడ్డులో భారీ గొయ్యి పడిందని వెంటనే హైవే సిబ్బందికి ఫోన్ చేసి సమాచారం అందించారు. హైవే సిబ్బంది, తాలుక పోలీసులు కలిసి వాహనాలను దారి మళ్లించి జెసిబి ద్వారా గొయ్యిని పూడ్చి వేశారు. అయితే దాదాపు 4గంటల పాటు భారీగా ట్రాఫిక్ జామ్ కావడంతో అటువైపు వెళ్లే వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.




జెసిబి సహాయంతో గొయ్యిని పూడ్చిస్తున్న పోలీసులు

## మే 13 వ తేదీన

# నంద్యాల జిల్లా స్థాయి చెస్ పోటీలు

**నంద్యాల టౌన్ మేజర్ న్యూస్:**

ఆంధ్ర చెస్ అసోసియేషన్ నిర్వహించబోయే రాష్ట్రస్థాయి చెస్ పోటీలలో పాల్గొనే జిల్లా జట్ల ఎంపిక కోసం నంద్యాల జిల్లా చెస్ సంఘం ఆధ్వర్యంలో ఈనెల 13వ తేదీ మంగళవారం ఉదయం 9 గంటల కు శ్రీ రామకృష్ణ విద్యాలయ ఇంగ్లీష్ మీడియమ్ స్కూల్లో జిల్లా స్థాయి 11 సంవత్సరముల లోపు బాల బాలికలకు వేరు వేరు విభాగాలలోచెస్ పోటీలు నిర్వహించడం జరుగుతుందని నంద్యాల జిల్లా చెస్ సంఘం అధ్యక్షులు డాక్టర్.రవికృష్ణ, కార్యదర్శి రామసుబ్బారెడ్డి,ఎస్వీ డిగ్రీ కళాశాల,సి.ఎం.ఎస్.జూని యర్ కళాశాల ప్రిన్సిపల్ ముని శేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు.ఈనెల 12వ తేదీ సాయంత్రం 6 గంటలలోపు ఏపీ చెస్ వెబ్ సైట్ లో ఎంట్రీలు నమోదు చేసుకోవాలని, నంద్యాల జిల్లా స్థాయిలో ఎంపికైన క్రీడాకారులు ఈనెల 24, 25వ తేదీల్లో గుంటూరులో జరగబోవు రాష్ట్ర స్థాయి చదరంగం పోటీలలో పాల్గొంటారని తెలిపారు.ఇతర వివరాలకు సంప్రదించవలసిన నెంబర్ 9010451585.

సూర్య



### మండలలోని సమస్యలు పరిష్కారం కానప్పుడు..

# సర్వసభ్య సమావేశం ఎందుకు ?

**జడ్పీటీసి ఆర్బి చంద్రశేఖర్ రెడ్డి**






గడివేముల మేజర్ న్యూస్ : గడివేముల మండలంలోని సమస్యలు పరిష్కారం కానప్పుడు మండల సర్వసభ్య సమావేశం ఎందుకని ఈ సర్వసభ్య సమావేశాన్ని బైకాట్ చేస్తున్నామని జడ్పిటిసి ఆర్బి చంద్ర శేఖర్ రెడ్డి, ఎంపీటీసీ మహేశ్వర్ రెడ్డి, మండల అధ్యక్షురాలు నాగ మద్దమ్మ, మంచాలకట్ట ఎంపీటీసీ ఉదారు రమాదేవి అన్నారు. ఈ సం దర్భంగా వీరు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల పరిసర ప్రాంతాలలో ప్రవేట్ కార్యక్రమాలు నిర్వహించకూడదని కూటమి ప్రభుత్వంలో జీవో వచ్చిందని ఆ జీవోను లెక్కచేయకుండా అధికారులు ప్రభుత్వ పాఠశాలలో ఏప్రిల్ ఒకటవ తేదీన పదవ తరగతి పరీక్షల సమ యంలో పాఠశాలలో ఆర్కెస్ట్రా నిర్వహించడం సరైనది కాదన్నారు. గడివేములలో స్మశాన వాటిక సమస్యను గత మూడు సర్వసభ్య సమా వేశాలలో సమస్యలు తెలిపిన ఇంతవరకు సమస్యలు పరిష్కారం కాలేదని సమస్యలు పరిష్కారం కానప్పుడు అధికారులు స్పందించి నప్పుడు సమావేశాలు ఎందుకు నిర్వహించాలి అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల అధ్యక్షురాలు నాగమద్దమ్మ మాట్లాడుతూ మండలంలోని విచ్చలవిడిగా బెల్ట్ షాపులు నిర్వహిస్తున్నారని ఎక్స్చేంజ్ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని అన్నారు. మంచాలకట్ట ఎంపీటీసీ రమాదేవి మాట్లాడుతూ గ్రామంలోని పొలాలకు వెళ్ళటానికి రస్త సౌకర్యాలు సరిగా లేవని పొలాలకు వెళ్ళటానికి రస్తాలు ఏర్పాటు చేయాలని అన్నారు. మంచాలకట్ట చెరువు కట్ట నందు కంపచెట్లు విరివిగా పెరిగాయి. కంప చెట్లను తొలగించి చెరువు కుంగకుండా భద్రత కల్పించాలని అన్నారు. గత మూడు నెలల నుండి ఎంపీటీసీలకు జీతాలు అందడం లేదని ఆగ్రహ వ్యక్తం చేశారు. మండల స్థాయి అధికారులు మండలంలో జరిగే సమావేశాలకు సమావేశం జరిగే రెండు గంటల ముందు తెలియపరుస్తున్నారని ఒకరోజు ముందు సమాచారం ఇవ్వాలని ఆగ్రహ వ్యక్తం చేశారు. గ్రామాల్లో ప్రజాప్రతినిధులుగా ఉంటూ గ్రామానికి ఉపయోగపడే అభివృద్ధి పనులు చేయలేకపోతున్నామని అధికారులు సహకరించడం లేదని అందువల్ల మండలంలో జరిగే సమావేశానికి బాయ్ కాట్ చేస్తున్నామని జెడ్పిటిసి ఆర్బి చంద్రశేఖర్ రెడ్డి, ఎంపీటీసీలు తెలిపారు.

## తహశీల్దార్‌కు వినతీపత్రం అందజేసిన ఎపీడబ్ల్యుజెఎఫ్



**బనగానపల్లెరూరల్‌మేజర్,న్యూస్ః** సాక్షి ఎడిటర్ ధనుంజయ రెడ్డి ఇంటిలో ఎలాంటి అనుమతులు లేకుండా నోటీసులు ఇవ్వకుండా పోలీసులు సోదాలు చేయడం దారుణమని ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ జిల్లా కన్వీనర్ మద్దయ్య యాదవ్ బనగానపల్లె నియోజవర్గ అద్యక్షులు గుండం సర్వేశ్వర రెడ్డి పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయం నందు ఎపీడబ్ల్యు.జెఫ్ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. అనంతరం తహశీల్దార్ నారాయణ రెడ్డికి వినతీపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత జర్నలిస్టులపై రోజురోజుకు దాడులు పెరిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సాక్షి ఎడిటర్ ధనుంజయ రెడ్డికి ముందస్తుగా ఎలాంటి అనుమతులు ఇవ్వ కుండా పోలీసులు ఇంటిలో చొరబడి సోదాలు చేయడం సమంజసం కాదన్నారు. ప్రభుత్వాలు జర్నలిస్టులపై దాడులు జరగకుండా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎపీడబ్ల్యుఎఫ్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు రాచంద్రా రెడ్డి (ఆంధ్ర అక్షర), నరిసింహా రెడ్డి (సూర్య), నియోజకవర్గ కార్యదర్శి షాషావలి (స్వతంత్ర), మండల అద్యక్షులు చంద్రశేఖర్ (ప్రజాశక్తి), ప్రధాన కార్యదర్శి బాల చెన్నయ్య (సాక్షి), మండల ఉపాధ్యక్షులు మధు (నేనుసైతం), మండల కార్యదర్శి రాజేష్ (సూర్య) నాయకులు ఓబులేసు, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సీ, ఎస్టీ కేసులోని ముద్దాయిలను అరెస్టు చేయాలి

**మంత్రాలయం రూరల్, మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని చట్నేపల్లి స్మశాన వాటిక సమస్యపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసు నమోదైన ముద్దాయిలను అరెస్టు చేయాలని జైభీమ్ ఎమ్మార్పిఎస్ రాష్ట్ర అధ్యక్షులు సిక్కిం జానయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీ కేసు నమోదైన ముద్దాయిలను అరెస్టు చేయాలని ఎమ్మిగనూరు డిఎస్పీ కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. ఈ స్మశాన వాటిక సమస్యను తీర్చి దళితులకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పోరాటాలు చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో చట్నేపల్లి గ్రామస్థులు పాల్గొన్నారు.




## నాటుసారా, లిక్కర్ అమ్మకాలపై దాడులు



**బనగానపల్లెరూరల్‌మేజర్,న్యూస్ః** గురువారంనాడు నంద్యాల డిసిఈఒ ఆదేశాల మేరకు ఎ.ఈ.ఎస్ నంద్యాల టీం మరియు కోవెలకుంట్ల టీం ఉమ్మడిగా దాడి చేసి బనగానపల్లె పట్టణం నందు మానేపాటి నాగలక్ష్మీలు మల్లికార్జున వద్ద నుండి 5లీటర్ల నాటుసారా, నందవరం నందు పాణ్యం చెన్నకేశవ రెడ్డి పంకర బాల వెంకటేశ్వర్లు వద్ద నుండి కర్నాటక మద్యం డిలక్స్ విస్కీ 48 , లిక్కర్ ప్యాకేట్స్ , అమృత్ సిల్వర్ కప్ బ్రాందీ 12 బాలిట్స్ స్వాధీనం చేసుకొని నందిపాడు నందు హనుమాన్ నాయక్ వద్ద నుండి 5లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సెబ్ సి.ఐ వర్థనాదేవి తెలిపారు.

## గూడ్స్ రైలు కింద పడి యువకుడు మృతి


రైలు పట్టాలపై యువకుడి మృతదేహం

**మహానంది, మేజర్‌న్యూస్ :** మహానంది మండల పరిధిలోని నంద్యాల - గిద్దలూరు రైల్వే ట్రాక్‌పై గాజులపల్లె రైల్వే స్టేషన్ సమీపంలో షేక్ ఖలీల్ (30) అనే యువకుడు మృతి చెందినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు గురువారం నంద్యాల నుంచి గిద్దలూరు వైపు వెళ్తున్న గూడ్స్ రైల్ కింద పడి మృతి చెందాడని, ఈ యువకుడిది మహానంది మండల గాజులపల్లె గ్రామానికి చెందిన షేక్ ఖలీల్‌గా గుర్తించడం జరిగిందని అన్నారు. హమాలీ పని చేసుకుంటూ జీవనం సాగించేవాడని, ఇతని మృతికి కారణాలు తెలియాల్సి ఉందని అన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నంద్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

## నెక్స్ట్ జెన్ ఈ-హాస్పిటల్ అప్లికేషన్ శిక్షణ

**కర్నూలు క్రైం, మేజర్‌న్యూస్ :** కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రస్తుతం ఉన్న ఈ-హాస్పిటల్ అప్లికేషన్‌ను నెక్స్ట్ జెన్ ఈ-హాస్పిటల్ అప్లికేషన్‌గా ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చిందని ఇంచార్జ్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. శ్రీరాములు తెలిపారు. ఇది రోగి రిజిస్ట్రేషన్, అడ్మిషన్, మరియు క్లినికల్ డేటా రికార్డింగ్‌తో సహా ఆసుపత్రి కార్యకలాపాల యొక్క వివిధ అంశాలను నిర్వహణను కూడా సులభతరం చేస్తుందని తెలిపారు. అందులో భాగంగా అసిస్టెంట్ ప్రొఫెసర్‌లు, పోస్ట్ గ్రాడ్యుయేట్ మరియు సిఎంఓలకు శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమంలో సిఎస్ఆర్ఎంఓ డాక్టర్ బివి రావు, అడ్మినిస్ట్రేటర్ సింధు సుబ్రమణ్యం, డాక్టర్ శివబాల నాగాంజన్, డాక్టర్ ఎంవి కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుంచి చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాలు

**ఓర్వకల్లు, మేజర్‌న్యూస్ :** ఓర్వకల్లు మండల కేంద్రంలో వెలసిన శ్రీదేవి, భూదేవి సహిత చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాలు నేటి నుంచి ప్రారంభమవుతాయని ఆలయ ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి గురువారం తెలిపారు. 9న శుక్రవారం విశాఖ సిప్తత్వాదశి రాత్రి 9గంటలకు గణపతి పూజ, అంకురారోహణము, స్వస్తి వచనము మచ్చం గ్రహణము, పంచపాలకరాధన, బజారోహణం, పట్టాభివాసం బేరి, మృదంగనాదం, మీన లగ్నంలో శనివారం ఉదయం 5.20గంటలకు తెల్లవారుజామున స్వామి వారి కళ్యాణోత్సవం, ఉదయం, సాయంకాలం పూజలు, దేవయాగం, బలిహరణం, సాయంత్రం 6గంటలకు స్వామి అమ్మవార్ల ఉత్సవ మూర్తుల ఊరేగింపు, 11న సాయంత్రం ప్రభోత్సవం, గరుడోత్సవం, 12న సాయంకాలం రథోత్సవం, 13న ఉదయం వసంతోత్సవం, సాయంత్రం ధ్వజారోహణం, పారువేట కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని కావున భక్తులందరు స్వామి వారిని దర్శించుకుని స్వామి వారి కృపకు పాత్రులవ్వాలని తెలిపారు.

## మారుతి స్పాత్ స్టీల్ ఫ్యాక్టరీ కాలుష్యంపై విచారణ

**- కాలుష్యంతో దెబ్బతిన్న పంటలు**

**- టీడీపీ యువ నాయకులు ఇంచార్జ్ మంత్రికి ఫిర్యాదు**


విచారణ చేపట్టిన ఈఈ

**మంత్రాలయం రూరల్, మేజర్ న్యూస్ :** మంత్రాలయం మండల పరిధిలోని మాధవరం గ్రామ సమీపాన ఉన్న మా రుతి నిస్పత్ నిగం లిమిటెడ్ స్టీల్ ఫ్యాక్టరీ నుంచి పొగ కాలుష్యం ద్వారా పంట పొలాలు దెబ్బతిని రైతులు నష్టపోతున్నామని రైతులు, మాజీ ఎంపిటీసీ అమర్నా థ్‌రెడ్డి, టీడీపీ యువ నాయ కులు కృష్ణ, మోహన్‌రెడ్డిలు ఇంచార్జ్ మంత్రి నిమ్మల రామనాయుడుకు ఫిర్యాదు చేశారు. ఈ విషయాన్ని మంత్రి జిల్లా కాలుష్య నియంత్రణ అధికారులకు విచారణ చేయాలని సూచించారు. కర్నూలు జిల్లా కాలుష్య నియంత్రణ ఈఈ కెవి కిషోర్ రెడ్డి, ఎఈ రామకృష్ణలు తనిఖీలు నిర్వహించి విచారణ చేపట్టారు. మాధవరం, రచ్చుమర్రి, చట్నేహళ్ళి, సూగూరు గ్రామాల రైతుల పంట పొలాలు దెబ్బతిన్నాయని, నష్ట పరిహారం సక్రమంగా అందడం లేదని తుతూమంత్రంగా అందజేస్తున్నారని రైతులు వాపోయారు. ఈ ఫ్యాక్టరీ కాలుష్యం వలన 7 గ్రామాలకు తాగునీరు అందించే సూగూరు ఎస్ఎస్ ట్యాంకు కాలుష్యమై రోగాల బారిన పడాల్సి వస్తుందని, ప్రజలు ఈ నీటిని త్రాగి అనారోగ్యానికి గురవుతామని, భయపడి తాగడం లేదని ఫిర్యాదు చేశారు. ఈ ఫ్యాక్టరీలో పనిచేసే సిబ్బంది పలు రోగాలకు గురై మృతి చెందారన్నారు. వీటన్నిటిపై సమగ్రంగా విచారణ చేసిన నివేదికను ఉన్నతాధికారులకు అందజస్తామని తెలిపారు.

## 10న లక్ష్మీ సమేత మద్దిలేటి నరసింహ స్వామి కళ్యాణోత్సవం

**ఓర్వకల్లు, మేజర్‌న్యూస్ :** మండల పరిధిలోని నన్నూరు గ్రామంలో జాతీయ రహదారి పక్కన నారాయణ కాలేజీ ఎదురుగా శ్రీ రంగ కొండపై వెలసిన శ్రీ లక్ష్మీ సమేత మద్దిలేటి నరసింహ స్వామి కళ్యాణ మహోత్సవాన్ని ఈ నెల 10న నిర్వహిస్తున్నట్లు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు గురువారం తెలిపారు. 10న రాత్రి 8గంటల నుండి 11వ తేదీ తెల్లవారుజామున 5గంటల వరకు మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన భజన బృందాలచే అఖండ భజన నిర్వహిస్తున్నామని తెలిపారు. కావున భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని తెలిపారు.

# బయో మైనింగ్ త్వరితగతిన పూర్తి చేయాలి

## – నగరపాలక కమీషనర్ రవీంద్రబాబు



బయోమైనింగ్ ప్రక్రియను పరిశీలిస్తున్న కమీషనర్ రవీంద్రబాబు

**కర్నూలు నగరం, మేజర్‌న్యూస్ :** గార్గేయపురం డంప్‌యార్డులో ప్రారంభమైన బయో మైనింగ్ ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేయాలని నగరపాలక కమీషనర్ యస్ రవీంద్రబాబు ఆదేశించారు. గురువారం డంప్‌యార్డులో బయోమైనింగ్ ప్రక్రియను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ ఆధ్వర్యంలో బయో మైనింగ్ ద్వారా చెత్త శుద్ధి చేసే ప్రక్రియ ప్రారంభమైందన్నారు. డంప్ యార్డులో నిల్వ ఉన్న దాదాపు 65వేల మెట్రిక్ టన్నుల వ్యర్థాలను రానున్న మూడు నెలల్లోపు బయో మైనింగ్ ప్రక్రియ ద్వారా శుద్ధీకరణ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. ట్రామెల్ యంత్రాన్ని వినియోగించుకొని చెత్తను నాలుగు పద్ధతుల్లో ప్రాసెసింగ్ చేస్తారని, ప్లాస్టిక్, ఇనుము, గాజు వస్తువులు, రాళ్లు,రప్పలను వేర్వేరు చేయడం జరుగుతుందన్నారు. అంతకుముందు కమీషనర్ సెట్కూరు కార్యాలయం వద్దనున్న అన్న క్యాంటీన్‌ను పరిశీలించారు. మెనూ,టోకెన్ల సంఖ్య, శుభ్రత అంశాలపై ఆరాతీశారు. నిర్వహణకు సంబంధించి ఏవైన సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని నిర్వాహకులకు సూచించారు. అలాగే కొత్తబస్టాండ్, గుత్తి పెట్రోల్ బంకు ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ప్రజారోగ్య అధికారి డాక్టర్ విశ్వేశ్వర్‌రెడ్డి, డిఈఈ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

# సాక్షి ఎడిటర్ పై దాడి ప్రజాస్వామ్యంపై దాడే

## – నంద్యాలలో ఏపీయుడబ్ల్యుజే, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ర్యాలీ




ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం



మహాత్మాగాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

**నంద్యాల, మేజర్‌న్యూస్ బ్యూరో :** సాక్షి ఎడిటర్ ధనుంజయ రెడ్డి ఇంట్లో పోలీసుల సోదాలు ప్రజాస్వామ్యంపై దాడిగా ప్రజాసంఘాలు అభివర్ణించాయి. నంద్యాలలో గురువారం సాయంత్రం ఏపీయుడబ్ల్యుజే, ప్రజాసంఘాలు సంయుక్తంగా నిరసన ర్యాలీని నిర్వహించాయి. శ్రీనివాస్‌సెంటర్ నుంచి గాంధీచౌక్ వరకు ర్యాలీ నిర్వహించి మహాత్మాగాంధీకి వినతిపత్రం అందజేశారు. సాక్షి పాత్రికేయుడు, ఏపీయుడబ్ల్యుజే జిల్లా ఉపాధ్యక్షుడు బాలమద్దిలేటి అధ్యక్షతన జరిగిన నిరసన కార్యక్రమంలో ఏపీయుడబ్ల్యుజే జిల్లా అధ్యక్షుడు మధుబాబు, స్టాఫ్ రిపోర్టర్ హరినాథ్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రాజశేఖర్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు నాగేంద్ర, జిల్లా కార్యదర్శి ఉస్మాన్, చల్లా మధు, బాలు నాయక్, ఎస్‌డీపీఐ, సీపీఎం, సీపీఐ, సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీలు, ప్రజాసంఘాలు పాల్గొన్నాయి. మధుబాబు మాట్లాడుతూ ధనుంజయ రెడ్డి ఇంట్లో సోదాలు నిర్వహించడం అప్రజాస్వామ్యమన్నారు. న్యాయ బద్ధంగా, చట్ట బద్ధంగా వెళ్ళాలని, అలా కాకుండా అనధికారికంగా సోదాలు నిర్వహించడం పత్రికా స్వేచ్ఛను హరించడమేనని అన్నారు. పత్రికలను గొంతు నొక్కే ప్రయత్నం చేయడం తగదని అన్నారు. హరినాథ్‌రెడ్డి మాట్లాడుతూ సాక్షిపై కూటమి ప్రభుత్వం కక్ష సాధిస్తుందని అన్నారు. కూటమి వైఫల్యాలను, ప్రజా వ్యతిరేక చర్యలను ప్రశ్నిస్తున్నందుకే సాక్షి గొంతు నొక్కాలని చూస్తున్నారని అన్నారు. సాక్షి ప్రజాపక్షమే ఉంటుందని అన్నారు. ఏజెస్, నరసింహ, శంకర్, శ్రీనివాసులు, ఆకుమళ్ళ రహీం, తదితరులు మాట్లాడుతూ రాష్ట్రంలో పత్రికా స్వేచ్ఛ ఉందా అని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వంలో దాడులు, జరుగుతున్నాయని అన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రస్తుత ప్రభుత్వ హయాంలో ఇలాంటి సంఘటనలు చోటు చేసుకుంటు న్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో పాత్రికేయులు, ప్రజాసంఘాల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి మహోత్సవానికి ఎమ్మెల్యేకు ఆహ్వానం

### - ఎమ్మెల్యే మాండ్ర ను సన్మానించిన ఆలయ ఈవో



**నందికొట్కూరు రూరల్ మేజర్ న్యూస్ :** మండల కేంద్రమైన మిడుతూరులోని శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి కళ్యాణ మహోత్సవానికి రావాలని ఎమ్మెల్యే, నంద్యాల పార్లమెంట్ తెదేపా ఇంచార్జ్ మాండ్ర శివానందరెడ్డి లకు ఆహ్వాన పత్రిక అందజేసినట్లు ఆలయ ఈవో ఏడి వెంకటరమణ తెలిపారు. గురువారం మండల పరిధిలోని అల్లూరు గ్రామంలో ఎమ్మెల్యే గిత్త జయసూర్య ,నంద్యాల పార్లమెంట్ తెదేపా ఇంచార్జ్ మాండ్ర శివానందరెడ్డిలను మర్యాదపూర్వం కలిసి పూల మాలవేసి శాలువ కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ ఖాతా రమేష్ రెడ్డి, టిడిపి సీనియర్ నాయకులు సురేంద్రనాథ్‌రెడ్డి,కడుమూరుగోవర్ధన్‌రెడ్డి, పగిడ్యాల టిడిపి మండల కన్వీనర్ పలుచాని మహేశ్వర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పశుగ్రాసం దగ్ధం..

# రూ.2లక్షల వరకు ఆస్తినష్టం



చింతామనిపల్లె గ్రామంలో పూర్తిగా దగ్ధమవుతున్న గడ్డివాములు

**సి.బెళగల్ క్రైమ్ న్యూస్ :** సి.బెళగల్ మండలం చింతామనిపల్లె గ్రామంలో బుధవారం అర్ధరాత్రి గుర్తు తెలియని దుండంగులు పశుగ్రాసానికి నిప్పు పెట్టారు. దీనితో పశుగ్రాసం పూర్తిగా దగ్ధం అయింది. గ్రామస్థుల సమాచారం మేరకు గ్రామానికి చెందిన భాస్కరరెడ్డికి చెందిన రెండువాము ల పశుగ్రాసం బుధవారం అర్ధరాత్రి నిప్పు ఆటుకోవడంతో ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించి ఆర్పే ప్రయత్నం చేశారు. అప్పటికే పూర్తిగా కాలి బూడిద యాయి. కాలిపోయిన పశుగ్రాసం విలువ సుమారు రూ.2లక్షల వరకు ఆస్తినష్టం జారిందని బాధితుడు భాస్కరరెడ్డి తెలిపారు.

# మిడుతూరులో ఉమ్మడి జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు

**మిడుతూరు మేజర్ న్యూస్ :** మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి తిరుణాల సందర్భంగా ఈనెల 12 వ తేది నుండి జిల్లా స్థాయి కబడ్డీ పోటీలను కాతా రమేష్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మొదటి బహుమతి రూ.30వేలు రెండవ బహుమతి రూ.20వేలు మూడో బహుమతి రూ.10వేలు నాలుగో బహుమతి రూ.5వేలు అందించనున్నట్లు తెలిపారు.కబడ్డీ పోటీలలో పాల్గొనదలచిన వారు ప్రతి జట్టు రూ.500 లు చెల్లించి పేర్లను నమోదు చేసుకోవాలని కమిటీ సభ్యులు తెలిపారు. ఏదైనా సమాచారం కొరకు ఈ క్రింద కనపర్చిన సెల్ నంబర్లను 8897762487,9908888224,8790708391 సంప్రదించవలేనని కోరారు.

## ఘనంగా శ్రీ వీర సుంకలాపరమేశ్వరీ దేవి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం



**తుగ్గలి,మేజర్ న్యూస్ :** తుగ్గలి మండలం పరిధిలోని చెన్నంపల్లి గ్రామంలో వెలిసిన శ్రీ వీర సుంకలాపరమేశ్వర దేవి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవంవేడుకలను గురువారం గ్రామ పెద్దలు, గ్రామ ప్రజలు ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ఉదయం 8-00గంటల నుండి 9-00 గంటలలోపు మిథు నలగ్నయందు, యంత్ర స్థాపన, విగ్రహప్రతిష్ఠ, గోపుర కలశ ప్రతిష్ఠ, బలిహారణ, పూర్ణాహుతి, నివేదన, మంగళ హారతి కార్యక్రమాలు వేద పండితుల ఆధ్వర్యంలో పూజా కార్యక్రమా లు నిర్వహించినట్లు వారు పేర్కొన్నారు. భక్తాదులందరూ అధిక సంఖ్యలో హాజరై అమ్మవారి యొక్క తీర్థ ప్రసాదములు స్వీకరించి అమ్మవారి ఆశీస్సులు పొందారు.అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

# అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి



మృతురాలి (ఫైల్‌ఫోటో)

**డోన్ రూరల్ మేజర్ న్యూస్ :** అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి చెందిన ఘటన గురువారం పట్టణ సమీపంలోని భారత్ దాబా దగ్గర కాలనిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే కృష్ణగిరి మండలం ఎరుకలచెర్వు గ్రామానికి చెందిన ఎల్లప్పకు కోడుమూరు మండలం గోరంట్లగ్రామానికి చెందిన చిన్నారితో గత నాలుగు నెలల క్రితం వివాహమైంది. గురు వారం ఇంట్లో చిన్నారి 18 అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది.తరచూ చిన్నారిని భర్త వేధిస్తున్నాడని భర్తనే హత్య చేశాడంటూ మృతురాలి బంధువులు ఆరోపిస్తున్నారు. సమా చారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# ఈతకు వెళ్లి బాలుడు మృతి



**ఎమ్మిగనూరు టౌన్, మేజర్ న్యూస్ :** ఈతకు వెళ్లిన బాలుడు నీట మునిగి మృతి చెందిన సంఘటన గురువారం చోటు చేసుకుంది.ఎమ్మిగనూరు మండలం గుడికల్లు గ్రామం దగ్గర ఉన్న ఎస్ఎస్ ట్యాంక్ వద్ద ఉన్న కాలువలో పడి మృతి చెందాడు. పట్టణంలోని ఎన్‌యంటీ కాలనీలో నివాసం ఉంటున్న ఉపాధ్యాయుడు శ్రీనివాసులు కుమారుడు రోహన్ ( 12) సరదాగా ఈతకు వెళ్లి నీళ్లు మింగి ఊపిరాడక మృతి చెందాడని తెలిపారు. కుమారుడు మృతి చెందడంతో బాలుడు తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు.

# అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకం కోసం రైతులు దరఖాస్తు చేసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

**తుగ్గలి,మేజర్ న్యూస్ :** అన్నదాతసుఖీభవ, పీ ఎం కిసాన్ పథకాల ద్వారా రైతులు రూ 20 వేలు ఆర్థిక సహాయం పొందేందుకు రైతులు సంబంధిత రైతు సేవ కేంద్రంలో దరఖాస్తులు చేసుకోవాలని తహసీల్దార్ రమాదేవి, వ్యవసాయ అధికారి పవన్ కుమార్‌లు తెలిపారు. గురువారం తహసీ ల్దార్ కార్యాలయంలో వీఆర్వోలు, ఏఈఓ లు, ఎంపీఈవోలు, సచి వాలయం అగ్రిక ల్చర్ సహాయకులతో సమావేశం జరిగింది. సమావేశంలో వారు మాట్లా డుతూ ప్రభుత్వం నుండి అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకం కొరకు రైతులు ఆధార్ కార్డు, వన్ బి, అడంగల్ జిరాక్స్ పత్రాలను సంబంధిత రైతు సేవా కేంద్రం నందు ఇచ్చి తమ పేర్లు నమోదు చేయించుకోవాలని వారు తెలిపారు. అలాగే కౌలుదారులు కూడా సంబంధిత రైతు సేవ కేంద్రాల్లో కౌలు రైతు కార్డులను పొందాలని తెలిపారు. త్వరలోనే కౌలుకార్డులపై సచివాలయాల్లో మీటింగ్లు నిర్వహించడం జరుగుతుందని వారు తెలిపారు. అందువల్ల రైతులు అవకాశాల్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

# ఘనంగా వసంతికా పరిణయోత్సవం









**ఆళ్లగడ్డ, మేజర్ న్యూస్ :** ప్రముఖ వైష్ణవ క్షేత్రమైన ఎగువ అహోబిలంలో వైశాఖ మాస నరసింహ జయంతి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగు తున్నాయి. అందులో భాగంగా గురువారం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ జ్వాల నరసింహస్వామికి నవ కలశ తిరుమంజనం నిర్వహించారు. అర్చకులు మధుసూదన్ వేదమంత్రాల మధ్య స్వామి అమ్మవార్లకు నవకలశ తిరుమంజన సేవ నిర్వహించారు. అనంతరం మధ్యాహ్నం ఆలయ ప్రధాన అర్చకులు వేణుగోపాల ఆచార్యులు ఆధ్వర్యంలో వాసంతిక పరిణయోత్స వం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా ఉత్సవ మూర్తులైన శ్రీ జ్వాల నరసింహ స్వామి చెంచులక్ష్మి అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి ఎదుర్కోల కార్యక్రమం నిర్వహి ంచారు. అర్చకులు పూలమాలలను తలపై ఉంచుకొని చేస్తున్న నృత్యం చూపరులను ఆకట్టుకుంది. అనంతరం ఉత్సవ మూర్తులను ఊరేగింపుగా కళ్యాణ మండపానికి తీసుకొని వచ్చారు. సాంప్రదాయం ప్రకారం శ్రీ జ్వాల నరసింహస్వామి చెంచులక్ష్మి అమ్మవార్ల కళ్యాణోత్సవానికి ఆళ్లగడ్డ శాసన సభ్యురాలు భూమా అఖిలప్రియ పట్టు వస్త్రాలను సమర్పించారు. అర్చకులు వేద మంత్రాల మధ్య నాంది, పురుష సూక్తాలను వల్లిస్తూ జీలకర్ర బెల్లం తంతు, కంకణ ధారణ కార్యక్రమాలను గావించారు. అనంతరం స్వామి అమ్మవార్ల పేరిట పాదాల చెందిన ముత్యాల తలంబ్రాలు పోశారు. ఈ వసంతిక పరిణయోత్సవానికి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

## వైద్యులు, వైద్య సిబ్బంది సెలవులు రద్దు



మాట్లాడుతున్న ఇంచార్జ్ సూపరింటెండెంట్ శ్రీరాములు

**కర్నూలు క్రైం, మేజర్‌న్యూస్ :** భారత్-పాక్ మధ్య ఉద్రిక్తత నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వ సూచనల మేరకు అత్యవసర సమయంలో వైద్య సేవల పరంగా రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ వారి ఆదేశాల మేరకు అవసరమైన ముందస్తు చర్యలు తీసుకోవడానికి వైద్యులు, వైద్య సిబ్బందిని అప్రమత్తం చేస్తూ ఆదేశాలు జారీ చేసిందని అందులో భాగంగా ఆసుపత్రిలో పనిచేసే వైద్యులు, వైద్య సిబ్బందికి సెలవులు రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు ఇంచార్జ్ ఆసుపత్రి సూపరింటెండెంట్ శ్రీరాములు తెలిపారు. అత్యవసర సమయంలో ఎలా వైద్యాన్ని అందించలన్న దానిపై ఆసుపత్రుల్లో ఆక్సిజన్, మందులు, వెంటిలేటర్స్ అందుబాటులో ఉండి వైద్య సేవలకు అందరు సన్నద్ధంగా ఉండాలని సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారన్నారు.

## కర్నూలు జిల్లాకు దామోదరం సంజీవయ్య పేరు పెట్టాలి

:- కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత వి హనుమంతరావు



మాట్లాడుతున్న సీనియర్ నేత హనుమంతరావు

**కర్నూలు స్పోర్ట్స్, మేజర్‌న్యూస్ :** కర్నూలు జిల్లాకు మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య పేరు పెట్టాలని రాజ్యసభ మాజీ సభ్యులు వి హనుమంతరావు అన్నారు. గురువారం నగరంలోని త్రిగుణ ఇన్ హోటల్ నందు ఆయన దామోదరం రాధాకృష్ణ, కర్నూలు ప్రగతి సమితి అధ్యక్షుడు హర్షతో కలిసి విలేకర్ల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా హనుమంతరావు మాట్లాడుతూ రాజకీయాలలో మచ్చలేని నాయకుడు దామోదరం సంజీవయ్య అన్నారు. ఆయన సేవలు, గొప్పతనం భవిష్యత్తు తరాలకు తెలియజేయాలంటే ఆయన నివాస స్థలంలో స్మృతి వనం, లైబ్రరీ ఏర్పాటు చేయాలన్నారు. ఆపరేషన్ సిందూర్‌పై ప్రజలందరు భారత ప్రభుత్వానికి, సైనికులకు మద్దతుగా ఉండాలన్నారు. సింధూర్ ఆపరేషన్ సైనికుల విజయంగా తెలియజేశారు. ముఖ్యంగా పెద్దపాడులోని ఆయన నివాసాన్ని స్మృతి వనంగా చేర్చాలని ప్రభుత్వాన్ని కోరారు. ఏపి డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ ఇప్పటికే కోటి రూపాయలతో అభివృద్ధి చేస్తానని తెలిపారని ఆ దిశగా ఆయన కృషి చేయాలని కోరారు. అంతకుముందు దామోదరం సంజీవయ్య 53వ వర్ధంతి సందర్భంగా దామోదరం సంజీవయ్య స్వగ్రామం పెద్దపాడును జిల్లా కాంగ్రెస్ నాయకులతో కలిసి సందర్శించారు.

## అభివృద్ధి, సంక్షేమ సమ్మిళితంగా ప్రణాళికలు రూపొందించాలి

– జాయింట్ కలెక్టర్ బి నవ్య



పాల్గొన్న అధికారులు





మాట్లాడుతున్న జెసి నవ్య

**కర్నూలు, మేజర్‌న్యూస్ ప్రతినిధి :** అభివృద్ధి, సంక్షేమ సమ్మిళితంగా లక్ష్య ప్రణాళికలను రూపొందించాలని జాయింట్ కలెక్టర్ బి నవ్య అధికారులను ఆదేశించారు. గురువారం జడ్పి సమావేశ మందిరం స్వర్ణాంధ్ర-2047లో భాగంగా కర్నూలు, నంద్యాల జిల్లాల్లో నియోజకవర్గాల వారిగా లక్ష్య కార్యచరణ ప్రణాళికలపై వర్క్‌షాప్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ స్టేక్ హోల్డర్లతో జిల్లా నుండి మండల స్థాయి వరకు సమావేశాలు నిర్వహించి మండల స్థాయిలో వివరాలు సేకరించి ఇంటింటి సర్వే ద్వారా జిల్లాకు సంబంధించిన 2047డాక్యుమెంటేషన్ సిద్ధం చేసుకోవడం జరిగిందన్నారు. జిల్లా యాక్షన్ ప్లాన్‌కు అనుసంధానంగా నియోజకవర్గ, మండల స్థాయిలో మైక్రోలెవెల్ యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని సూచించారు. ప్లానింగ్ డిపార్ట్‌మెంట్ అడ్వైజర్ సీతాపతిరావు మాట్లాడుతూ నియోజకవర్గ స్థాయిలో రూపొందించే ప్రణాళికలకు చాలా ప్రాముఖ్యత ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, కర్నూలు, నంద్యాల సిపిఓ హిమ ప్రభాకర్‌రాజు, వేణుగోపాల్, కర్నూలు, పత్తికొండ ఆర్డీఓలు సందీప్‌కుమార్, భరత్,ఎంపిడిఓలు తదితరులు పాల్గొన్నారు.

## 15వరకు సిల్వర్‌సెట్ -2025 గడువు పెంపు



మాట్లాడుతున్న రిజిస్ట్రార్ కట్టా వెంకటేశ్వర్లు

**కర్నూలు స్పోర్ట్స్, మేజర్‌న్యూస్ :** క్లస్టర్ యూనివర్సిటీ సిల్వర్‌జూబ్లీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రవేశాలకు నిర్వహించే అర్హత పరీక్ష సిల్వర్ సెట్ 2025గడువును ఈ నెల 15వరకు పెంచుతున్నట్లు రిజిస్ట్రార్ డాక్టర్ కట్టా వెంకటేశ్వర్లు తెలిపారు. క్లస్టర్ యూనివర్సిటీ సిల్వర్ సెట్ అంటే ఎంతో ప్రతిష్టాత్మకమైన సెట్ అని ఈ సెట్ గురించి చాలా మంది విద్యార్థులకు తెలియాలనే ఉద్దేశ్యంతో గడువు పెంచామన్నారు. అదే విధంగా ఉమ్మడి కర్నూలు జిల్లా చుట్టుపక్కల గ్రామీణ ప్రాంత విద్యార్థులు ఎక్కువగా ఉన్నారని వారిని దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. సిల్వర్ సెట్ అర్హత పరీక్ష ఈ నెల 29న నిర్వహిస్తున్నట్లు క్లస్టర్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ కట్టా వెంకటేశ్వర్లు తెలియజేశారు.

## క్రికెట్ టోర్నమెంట్ బ్రోచర్‌ను ఆవిష్కరించిన ఎన్ఎండీ ఫయాజ్



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ఎన్ఎండీ ఫయాజ్

**నంద్యాల అర్బన్, మేజర్‌న్యూస్ :** ఈనెల 15న రాష్ట్ర మంత్రి ఎన్ఎండీ ఫరూక్ పుట్టిన రోజు సందర్భంగా నంద్యాల 33వ వార్డు టీడీపీ ఇన్‌చార్జి జోసెఫ్ ఆధ్వర్యంలో 9వతేదీ నుంచి స్థానిక ఎస్పీజీ గ్రౌండ్ నందు ఎస్పీఎల్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్న సందర్భంగా బ్రోచర్‌ను నంద్యాల టీడీపీ కార్యాలయం నందు రాష్ట్ర యువనాయకులు ఎన్ఎండీ ఫయాజ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రికెట్ టోర్నమెంట్‌లో మొదటి బహుమతి రూ.60 వేలు, రెండవ బహుమతి రూ.40 వేలు అందజేయడం జరుగుతుందని అన్నారు. ఎంట్రీ ఫీజు రూ.1000, బాల్ ఫీజు రూ.100 చెల్లించాల్సి ఉంటుందని అన్నారు. ఆసక్తి ఉన్న వారు 8వ తేదీ లోపు తమ టీమ్ పేర్లను నమోదు చేసుకోవాలని, ఇతర వివరాలకు 8919507340, 9701159958 నంబర్లకు సంప్రదించాలని కోరారు.

## సునీతకు రాయలసీమ యూనివర్సిటీ పిహెచ్‌డి ప్రధానం



**కర్నూలు స్పోర్ట్స్, మేజర్‌న్యూస్ :** కర్నూలు కెవిఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీలో మాథ్స్ లెక్చరర్‌గా పనిచేస్తున్న తిరివేది సునీతకు రాయలసీమ యూనివర్సిటీ పిహెచ్‌డి ప్రధానం చేశారు. సమ్ స్టడీస్ ఆన్ ఐడియల్స్ ఇన్ టెర్నరీ సెమిరింగ్ అనే అంశంపై ఆమె చేసిన పరిశోధనకు రాయలసీమ యూనివర్సిటీ పిహెచ్‌డి ప్రకటించారు. కెవిఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీలో పనిచేస్తున్న తిరువేది సునీతకు పిహెచ్‌డి ప్రకటించడం పట్ల ప్రిన్సిపల్ కె వెంకటరెడ్డి, క్లస్టర్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ కె వెంకటేశ్వర్లు అభినందనలు తెలిపారు.

DSC APPSC, TGPSC ప్రత్యేకం

# కరెంట్ అఫైర్స్ నవంబర్ 2024

(గత సంచిక తరువాయి....)

**26 ఇటీవల మరణించినటువంటి ప్రముఖ నవలా రచయిత దీరా సౌందర రాజన్ ఏ రాష్ట్రానికి చెందినవారు?**
1. కేరళ 2. తమిళనాడు
3. ఆంధ్రప్రదేశ్ 4. ఒడిశా

**27. ఈ క్రింది అంశాలను పరిశీలించండి?**
1. WTA ఫైనల్స్ లో అమెరికా టెన్నిస్ స్టార్ కోకో గాఫ్ తొలిసారిగా ఛాంపియన్ గా అవతరించారు .
2. ప్రపంచ ఏడో ర్యాంకర్ చైనా రైజింగ్ స్టార్ కిన్ వెన్ జెంగ్ పై చిరస్మరణీయ విజయం అందుకున్నారు
3. 2013 లో సెరన్ విలియమ్స్ తర్వాత WTA ఫైనల్స్ లో విజయం సాధించిన అమెరికా ప్లేయర్ గా గుర్తింపు పొందారు.
1. 1,2 మాత్రమే సరైనవి 2. 2,3 మాత్రమే సరైనవి
3. 1,3 మాత్రమే సరైనవి 4. పైవన్నీ సరైనవి

**28. మహిళ T20 లో ఒకే ఇన్నింగ్స్ లో అత్యధిక సిక్సర్లు కొట్టిన బ్యాటర్‌గా రికార్డు నెలకొల్పిన బీ లిజెల్ లి ఏ దేశానికి చెందిన క్రీడాకారిణి?**
1. ఆస్ట్రేలియా 2. న్యూజిలాండ్
3. సౌత్ ఆఫ్రికా 4. ఇంగ్లాండ్

**29. 2022-23 ఆర్థిక సంవత్సరంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో జిల్లాల వారీగా తలసరి ఆదాయానికి సంబంధించి ఈ క్రింది వాటిలో చిట్టచివరిగా ఉన్నటువంటి జిల్లాలు ఏవి?**
1. శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు జిల్లా
2. పల్నాడు,నంద్యాల, విజయనగరం
3. విశాఖపట్నం,కృష్ణ, అనంతపురం
4. గుంటూరు,అన్నమయ్య, అంబేద్కర్ కోనసీమ

**30. 2023-24 లో దేశ జిడిపిలో మొదటి రెండు స్థానాలు మరియు చివరి రెండు స్థానాలలో ఉన్న రాష్ట్రాల జాబితా సరైన వరుస క్రమం గుర్తించండి?**
1. మహారాష్ట్ర, తమిళనాడు & ఆంధ్రప్రదేశ్, మధ్య ప్రదేశ్
2. ఉత్తర్ ప్రదేశ్, తమిళనాడు & తెలంగాణ, మధ్య ప్రదేశ్
3. కర్ణాటక, మహారాష్ట్ర & రాజస్థాన్, తెలంగాణ
4. గుజరాత్, పశ్చిమ బెంగాల్ & ఆంధ్రప్రదేశ్, మధ్య ప్రదేశ్

**31. దేశంలోని గ్రామీణ ప్రాంతాలలోని ప్రతి ఇంటికి ఐదేళ్లలో కుళాయి ఏర్పాటు చేసి తాగునీరు అందించాలని లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం జల జీవన్ మిషన్ పథకం ను ఎప్పుడు ప్రారంభించింది?**
1. 2019 మార్చి 22 2. 2019 జూన్ 5
3. 2019 ఆగష్టు 15 4. 2019 నవంబర్ 25

**32. కేంద్ర పర్యావరణ అటవి మంత్రిత్వ శాఖ నివేదిక ప్రకారం 2019-24 మధ్య ఏనుగుల కారణంగా మరణించిన మనుషుల సంఖ్య?**
1. 2,829 2. 3,249
3. 4, 789 4. 2,928

**33. కేంద్ర పర్యావరణ అటవీ మంత్రిత్వ శాఖ నివేదిక ప్రకారం 2019-24 మధ్య ఏనుగుల దాడిలో మరణించినటువంటి మనుషుల సంఖ్య ఎక్కువగా ఈ రాష్ట్రాలలో నమోదు కావడం జరిగింది?**
1. ఒడిశా, అస్సాం, తమిళనాడు
2. ఒడిశా, అస్సాం, కర్ణాటక
3.కేరళ, జార్ఖండ్, చత్తీస్గడ్
4. కర్ణాటక,తమిళనాడు, పశ్చిమ బెంగాల్

**34. ఇటీవల ప్రతిష్టాత్మక టాస్ ఎమ్మెస్ స్వామినాథన్ అవార్డుకి ఎంపికైన మొక్కజొన్న శాస్త్రవేత్త బొడ్డుపల్లి మారుతి ప్రసన్న ఆంధ్రప్రదేశ్ లో ఈ జిల్లాకు చెందినవారు?**
1. పార్వతిపురం మన్యం జిల్లా
2. విశాఖపట్నం జిల్లా
3. గుంటూరు జిల్లా 4. బాపట్ల జిల్లా

**35. ఈ క్రింది వాటిలో సరైన అంశాలను గుర్తించండి?**
1. Cop-29 వ సదస్సు అజర్ బైజాన్ రాజధాని బాకు వేదికగా నవంబర్ 12 న ప్రారంభించడం జరిగింది
2. ఈ సదస్సుకు మన దేశం తరఫున 19 మంది సభ్యుల బృందం పాల్గొంటుంది. కేంద్ర పర్యావరణ శాఖ మంత్రి ఉపేందర్ యాదవ్, ఆ శాఖ సహాయ మంత్రి కీర్తి వర్ధన్ సింగ్ ఈ బృందానికి నేతృత్వం వహిస్తారు
3. కాప్ సదస్సుకు ఆఫ్ఘనిస్తాన్ తన ప్రతినిధులను పంపటం ఇదే తొలిసారి (ఆఫ్ఘనిస్తాన్‌లో 2022లో తాలిబన్‌లు పాలన పగ్గాలను అందుకు న్నారు.)
1. 1 మాత్రమే 2. 2 మాత్రమే
3. 1,2,3 సరైనవి 4. 1,2 సరికానివి




**36. 2015 లో జరిగిన కాప్ -21 సదస్సు సందర్భంగా ఎన్ని దేశాల మధ్య పారిస్ ఒప్పందం జరిగింది?**
1. 190 2. 193
3. 196 4. 192

**37. అఖిల భారత విద్యా సర్వే నివేదిక ప్రకారం నేడు దేశంలో గల మొత్తం వర్సిటీల సంఖ్య?**
1. 1043 2. 1430
3. 1340 4. 1034

**38. మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని పురస్కరించుకొని ప్రతి ఏటా నవంబర్ 11న జాతీయ విద్యా దినోత్సవం నిర్వహిస్తారు. అయితే 1958 నుంచి ఇప్పటివరకు ఎంతమంది కేంద్ర విద్యా శాఖ మంత్రులుగా వ్యవహరించారు?**
1. 27 2. 29
3. 31 4. 32

**39.ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి సమగ్ర సుస్థిర నగర అభివృద్ధి ప్రాజెక్టులో భాగంగా తొలి దశలో ఎన్ని వేల కోట్లతో చేపడుతున్న పనులకు ప్రపంచ బ్యాంకు, ఏసియన్ డెవలప్మెంట్ బ్యాంకు కలిసి సుమారు ఎన్ని కోట్లు రుణంగా ఇవ్వనున్నాయి?**
1. రూ. 15,000 కోట్లు 2. రూ. 13,500 కోట్లు
3. రూ. 14,500 కోట్లు 4. రూ. 12,500 కోట్లు

**40. పాఠశాల స్థాయి విద్యార్థులు పాఠ్యాంశాలను మరింత సులభంగా నేర్చుకునేందుకు వీలుగా టెక్ బుక్ ను అందుబాటులోకి తెచ్చినట్లు లీడ్ గ్రూప్ ప్రకటించింది. దీనికి ప్రస్తుతం సీఈఓ గా ఎవరు బాధ్యతలు నిర్వహిస్తున్నారు?**
1. క్రిస్టియన్ లిండార్న్ 2. సుమిత్ మెహతా
3. ఉత్సా లిండార్న్ 4. ఎవరు కాదు

**41. ఐరోపా వాతావరణ సంస్థ కోపర్నికస్ నివేదిక ప్రకారం 2024 అత్యంత వేడి సంవత్సరంగా నమోదు కావచ్చని పేర్కొంది. అయితే 2023లో అత్యంత వేడి నెలగా ఏ నెల నమోదు కావడం జరిగింది?**
1. అక్టోబర్ 2. సెప్టెంబర్
3. మే 4. జూన్

**42. నేషనల్ లీగల్ సర్వీసెస్ డే నీ ఇటీవల ఏ రోజున జరుపుకున్నారు?**
1. 09 నవంబర్ 2. 08 నవంబర్
3. 07 నవంబర్ 4. 06 నవంబర్

**43. ఇటీవల విడుదల చేసిన హేన్లీ పాస్పోర్ట్ ఇండెక్స్ 2024 లో అగ్రస్థానంలో ఉన్న దేశం?**
1. సింగపూర్ 2. జపాన్
3. ఫ్రాన్స్ 4. చైనా

**44. గరుడ శక్తి సైనిక విన్యాసాలు 9వ ఎడిషన్ నవంబర్ 1 నుంచి 22 వరకు ఎక్కడ జరుగనున్నాయి?**
1. న్యూజిలాండ్ 2. ఇండోనేషియా
3. దుబాయ్ 4. అమెరికా

**45. నేషనల్ శాంపిల్ సర్వే ఆర్గనైజేషన్ నివేదిక ప్రకారం జాతీయంగా ప్రభుత్వ పాఠశాలల్లో ఎన్రోల్మెంట్ రేషియో ఎంత శాతం కలదు?**
1. 66.7% 2. 76.7%
3.56.7% 4. 64.7%

**46. ప్రధానమంత్రి విశ్వకర్మ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం ఎప్పుడు ప్రారంభించింది?**
1. 2022 2. 2023
3. 2024 4. 2021

**47.వరల్డ్ హెరిటేజ్ సైట్లు అత్యధికంగా ఉన్న టాప్ -10 దేశాలు లో మొదటి మూడు స్థానాలు మరియు చివరి రెండు స్థానాలలో ఉన్న దేశాల జాబితాను గుర్తించండి?**
1. చైనా, ఇటలీ, జర్మనీ , రష్యా, ఇరాన్
2. ఇటలీ, చైనా, జర్మనీ , ఉత్తర ఐర్లాండ, మెక్సికో
3. ఇటలీ, చైనా, జర్మనీ , రష్యా, ఇరాన్
4. చైనా, ఇటలీ, భారత్ , ఫ్రాన్స్, ఇరాన్

**48. 2024 ఏప్రిల్ జూన్ మధ్య కాలానికి అత్యధిక సౌర విద్యుత్ ఉత్పత్తి చేసిన రాష్ట్రం?**
1. రాజస్థాన్ 2. గుజరాత్
3. కర్ణాటక 4. ఆంధ్రప్రదేశ్

**49. ఇటీవల వార్తల్లో నిలిచిన సౌత్ వెస్ట్ ఎయిర్లైన్స్ ఏ దేశానికి చెందిన ప్రధాన విమానాయాన సంస్థ?**
1. అమెరికా 2. ఆఫ్రికా
3. బ్రిటన్ 4. ఇండియా

**50. క్రింది వాటిలో భారతదేశంలో మొదటి పోలో స్టేడియాన్ని ఎక్కడ ప్రారంభించారు?**
1. అరుణాచల్ ప్రదేశ్ 2. మేఘలాయ
3. మణిపూర్ 4. లడఖ్

**జవాబులు :**
26)1, 27)3, 28)3, 29)1, 30)1, 31)3, 32)1, 33)2, 34)4, 35)4, 36)3, 37)1, 38)2, 39)2, 40)2, 41)1, 42)1, 43)1, 44)2, 45)1 46)2, 47)3, 48)1, 49)1, 50)4



**N.Jagadeesh,**
**Content Writer**
**V. J. Study Circle**

G20 BRASIL 2024

## జి-20 శిఖరాగ్ర సభ - తీర్మానాలు

పశ్చిమాసియా సంక్షోభం, రష్యా, ఉక్రెయిన్ యుద్ధం, నిరుద్యోగం, ఆహార, ఇంధన సంక్షోభాల నేపథ్యంలో బ్రెజిల్‌లో రియోడి జనరిలో నిర్వహించిన జి-20 దేశాల శిఖరాగ్ర సభ అనేక తీర్మానాలను చేసింది. అంతర్జాతీయ సహకారం, రాజకీయ చొరవతో సుస్థిరాభివృద్ధి సాధించాలని తీర్మానం చేసింది. రాబోయే ఆరేళ్ళలో పునరుత్పాదక ఇంధన వనరుల సామర్థ్యాన్ని మూడు రెట్లకు పెంచడం, ఎడారీకరణ నివారించడం, ప్లాస్టిక్ కాలుష్యాన్ని అరికట్టడం, ఉగ్రవాదంపై పోరు తదితర అనేక తీర్మానాలు చేసారు.

ప్రపంచంలో ఘర్షణలు, యుద్ధాల కారణంగా పేదదేశాలు ఆహార, ఇంధన, ఎరువుల సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయని దీనిని జి-20 పరిష్కరించాలని భారత ప్రధాని నరేంద్రమోదీ పేర్కొన్నారు. గత సంవత్సరం భారతదేశంలో నిర్వహించిన జి-20 సదస్సులో 'ఒకే ప్రపంచం-ఒకే కుటుంబం-ఒకే భవిష్యత్తు' నినాదం ఆవశ్యకత ఇంకా ఉందని చెప్పారు.

ఈ సదస్సులో ప్రదాని మోదీతో పాటు అమెరికా, బ్రిటన్, బ్రెజిల్, సింగపూర్, స్పెయిన్ తదితర దేశాధ్యక్షులతో పాటు ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెరస్ పాల్గొన్నారు. 2008 జి-20 సమావేశానికి నేటికీ పెద్ద తేడా లేదని ఆకలి, దారిద్ర్యం ప్రపంచ ప్రజలను పీడిస్తున్నాయని బ్రెజిల్ అధ్యక్షుడు పేర్కొన్నారు. దీనిపై పోరాడటానికి ప్రపంచ కూటమి స్థాపించాలని పిలుపునిచ్చారు. ప్రధాని మోదీ బ్రిటన్ ప్రధాని కియర్ స్టార్మర్‌తో చర్చలు జరిపారు. బ్రిటన్, భారత్ మధ్య స్వేచ్ఛాయుత వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టిపి) పై అనుమానాలకు తెరదించారు. పరారీలో ఉన్న విజయ్ మాల్యా, నీరవ్ మోడీలను భారత్‌కు అప్పగించే ప్రక్రియను వేగవంతం చేయాలని ప్రధాని మోదీ కోరారు. బెల్‌ఫాస్ట్, మాంచెస్టర్ నగరాల్లో నూతన కాన్సులేట్లు తెరవాలని నిర్ణయించారు. గాజాకు మరింత సాయం అందించాలని, ఉక్రయిన్ యుద్ధానికి తెరదించాలని సదస్సు తీర్మానం చేసింది. తీర్మానాలు సరే. అమలు ఎలా అన్నదే సమస్య. యుద్ధం కారణంగా ప్రపంచం అతలాకుతలమవుతోంది. మరి దీని నివారణ ఎలా? అగ్రదేశాలు చిత్తశుద్ధితో కృషి చేయనంతవరకు ఈ సమస్య పరిష్కారం కాదు. విభేదాల కారణంగా సదస్సు చివరలో జరగాల్సిన విలేకరుల సమావేశాన్ని సైతం రద్దు చేసారు. ఉక్రెయిన్‌కు అపార ఆయుధ సామాగ్రి అందించి, రష్యా ప్రభావాన్ని తగ్గించాలనేది అమెరికా ప్రయత్నం. ఓవైపు జి-20 సదస్సు జరుగుతుంటే మరోవైపు తాము ఉక్రెయిన్‌కు అందించిన దీర్ఘశ్రేణి క్షిపణులను రష్యాపై ప్రయోగానికి అమోరికా అధ్యక్షుడు బైడెన్ అనుమతి ఇచ్చారు. దీనికి ప్రతిగా రష్యా అణు విధానాన్ని పునఃసమీ క్షించింది. ఫలితంగా అణుయుద్ధ ముప్పు ఏర్పడింది. పర్యావరణ పరిరక్షణ జి-20 ప్రధాన ఆశయాలలో ఒకటి. దీనికి నిధుల కొరత తీవ్రంగా ఉంది. శిలాజ ఇంధనాల వినియోగం తగ్గించేందుకు ఎలాంటి స్పష్టమైన ప్రణాళికా లేదు. తీర్మానాలు కేవలం కాగితాలకే పరిమితం అవ్వకుండా కార్యాచరణకు నోచుకోవాలి. అపుడే ఏ కూటమికైనా విలువ ఉంటుంది. లేకపోతే నామమాత్ర సమావేశాలుగా మిగిలిపోతాయి. ఇకనైనా అగ్రదేశాలు సొంత ప్రయోజనాలు కొంత మానుకొని ప్రపంచ శాంతి కోసం కృషి చేయాలి.

# పేదల ఇళ్ళ నిర్మాణాలకు అదనపు సాయం



అవగాహన కల్పిస్తున్న ఎంపీడీఓ

**చాగలమర్రి, మేజర్ న్యూస్ :** అసంపూర్తిగా ఉన్న ఇళ్ళ నిర్మాణాలను పూర్తి చేసేందుకు ప్రభుత్వం అదనపు ఆర్థిక సహాయాన్ని అందజేస్తున్నదని ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్ తెలియజేసారు. గురువారం చాగలమర్రి పట్టణంలోని కుంచిపురి ఎరుకలి కాలనీలోని ప్రభుత్వ గృహాల లబ్దిదారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్బంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రభుత్వలేఅవుట్లలో అసంపూర్తిగా ఉన్న గృహ నిర్మాణాలను పూర్తి చేసేందుకు ప్రభుత్వం బిసి,ఎస్సీలకు రూ 50 వేలు,ఎస్టీలకు రూ 75వేలు,చెంచులకు లక్ష రూపాయలు అదనపు ఆర్థిక సహాయాన్ని ముంజూరు చేసిందన్నారు. లబ్దిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని గృహ నిర్మాణాలు పూర్తి చేసి తమ సొంత ఇంటి కలను నెరవేర్చుకోవాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతి కార్యదర్సి మనోజ్,హౌసింగ్ వర్క్ఇన్స్పెక్టర్ ఓబులేసు,ఇంజనీరింగ్ సహాయకులు కృష్ణనాయక్,కోటి,నరేష్లు పాల్గొన్నారు.

# ఖైదీలు సత్ ప్రవర్తన కలిగి ఉండాలి..!

**- నందికొట్కూరు సబ్ జైలు సందర్శన - జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి**




**నందికొట్కూరు రూరల్ మేజర్ న్యూస్ :** ఖైదీలు సత్ ప్రవర్తన కలిగి ఉండాలని జీవితాలు నాశనం చేసుకోవద్దని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి. లీలా వెంకట శేషాద్రి ఖైదీలకు సూచించారు. గురువారం స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆదేశాల పట్టణంలోని స్థానిక సబ్ జైలును ఆయన తనిఖీ చేశారు. అనంతరం లీగల్ అవేర్నెస్ ప్రోగ్రాం నిర్వహించారు . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేద ఖైదీలకు న్యాయవాదులు లేకుంటే ఉచిత న్యాయ సహాయం అందిస్తామన్నారు. త్వరగా బెయిల్ మంజూరు అయ్యేలా కృషి చేస్తామన్నారు. 70 ఏళ్లు పైబడిన ఖైదీలు ఉంటే వారికి ఉచిత న్యాయ సహాయం అందిస్తామనితెలిపారు. ఖైదీలకు అందిస్తున్న ఆహారంపై ఆరా తీసి,ఆరోగ్య పరిస్థితుల పై అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జైలు సూపర్డెంట్ ఎస్. కే. ఎం. డి రఫీ, జైలు విసిటింగ్ లాయర్ అరుణ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరీ దేవి అమ్మవారి

# వజ్రోత్సవ వేడుకలు

**వజ్రోత్సవ వేడుకల్లో పాల్గొన్న మంత్రి బిసి సతీమణి బిసి ఇందిరమ్మ**

**బనగానపల్లె,మేజర్న్యూస్ :** బనగానపల్లె నియోజకవర్గంలోని కోయిలకుంట్ల పట్టణంలో కొలువుదీరిన శ్రీవాసవి కన్యకాపరమేశ్వరిదేవి అమ్మవారి వజ్రోత్సవ వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. ఈ వజ్రోత్సవ వేడుకలకు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు పెండేకంటి సుబ్రహ్మణ్యం మరియు ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షులు కర్నాటి అభిలాష్, మణి ఆహ్వానం మేరకు వేడుకల్లో చివరి రోజు రాష్ట్ర మంత్రివర్యులు బీసీ జనార్ధన్ రెడ్డి సతీమణి శ్రీమతి బీసీ ఇందిర రెడ్డి పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా బిసి ఇందిరమ్మ అమ్మవారికి పట్టు వస్త్రాలు, ఒడి బియ్యం సమర్పించిన అనంతరం కలశానికి అభిషేకం చేసిన బీసీ ఇందిరమ్మకు ఆర్యవైశ్య సంఘం మహిళలు ఒడి బియ్యం అందజేశారు. అనంతరం బీసీ ఇందిరా రెడ్డిని, ఇల్లూరు లక్ష్మయ్యని, టంగుటూరి సీనయ్య ని, జాగృతి ఇంటర్నేషనల్ వైస్ ప్రెసిడెంట్ నంద్యాల జిల్లా అధ్యక్షురాలు గుండా సుప్రజని ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు ఘనంగా సన్మానించారు.



# బ్రాహ్మణదొడ్డిలో భూ రీసర్వేను ప్రారంభించిన రెవెన్యూ అధికారులు

**సి.బెళగల్ మేజర్ న్యూస్ :** సి.బెళగల్ మండలం బ్రాహ్మణదొడ్డి గ్రామంలో గురువారం భూరీసర్వేను రెవెన్యూ అధికారులు ప్రారంభించారు. ఈసందర్భంగా ఇంచార్జి తహశీల్దార్ పురుషోత్తమ్ముడు మాట్లాడుతూ గత ప్రభుత్వం చెప్పట్టిన రీ సర్వే మండలంలో సి.బెళగల్,బ్రాహ్మణదొడ్డి మినహా అన్ని రెవెన్యూ గ్రామాలలో రీసర్వే నిర్వహించారు. మొదటి విడత రీసర్వేలో చాలా తప్పులు చోటు చేసుకొన్నాయి. వాటిని సరిచేసుకొనే క్రమంలో రైతులు చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నారు. నాటి అనుభవం నేపథ్యంలో నేడు రెండవ దఫా రీ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని, అందుకు రీ సర్వే అధికారులుముందస్తు ప్రణాళికతో రైతులకు సమాచారం అందిస్తూ వారి అధీనంలో రీ సర్వే ను కొనసాగాలని సూచించారు. రీ సర్వేను నిర్వహించేందుకు విఎస్ లకు శిక్షణ తరగతులు నిర్వహించమని తెలిపారు. ఆరు టీంలను ఏర్పాటు చేశామని ప్రతి రోజు మండల సర్వేయర్ నాగభూషణం సూచన మేరకు వారి అధీనంలో రీసర్వే నిర్వహిస్తారని రీసర్వే డిటి వెంకటేశ్వర్లు తెలిపారు.



అధికారులతో కలిసి ప్రారంభిస్తున్న ఇంచార్జి తహశీల్దార్ పురుషోత్తమ్ముడు

# మారేళ్ళలో ఉచిత కంటి వైద్య శిబిరం

**తుగ్గలి,మేజర్ న్యూస్ :** తుగ్గలి మండల పరిధిలోని మారేళ్ళ గ్రామంలోని స్థానికంగా ఉన్నపంచాయతీకార్యాలయంలో పత్తికొండ ఎమ్మెల్యే కెయి శ్యామ్ కుమార్ ఆదేశాల మేరకు తుగ్గలి మండల టీడీపీ కన్వీనర్ ఆర్తిరుపాలు నాయుడుఆద్వర్యంలో స్థానిక గ్రామ టీడీపీ నాయకులు సమక్షంలో కర్నూల్ జిల్లా సుశీల నేత్రాలయ వారి సౌజన్యంలో గ్రామ ప్రజలకు ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కన్వీనర్ ఆర్ తిరుపాలు నాయుడు మాట్లాడుతూ గ్రామాల్లోని ప్రజలు కంటి




సమస్యలతో బాధ పడే వారికి పత్తికొండ ఎమ్మెల్యే కెయి శ్యామ్ కుమార్ నిర్వహణలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించడం సంతోషంగా ఉన్నదని,ఇందుకు మారెల్లా చుట్టూ ప్రక్కల ఉన్న గ్రామాల ప్రజలు యువత వచ్చి అనుభవమైన వైదులచేత కంటి పరీక్షలు చేయించుకోవడం జరిగిందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ తోట చంద్ర శేఖర్,జయంతి,టీడీపీ సీనియర్ నాయకులు ఎద్దుల దొడ్డి శ్రీనివాసులు గౌడ్, మారేళ్ళ మాజీ ఎంపీటీసీ సభ్యులు ఈ వెంకట రాముడు,గ్రామ టీడీపీ సీనియర్ నాయకులు దేవరింటి వెంకటరాముడు,ధనుంజయ,మద్దయ్య, మొర్రి శంకర్,బల్లె కిట్టయ్య తదితరులు పాల్గొన్నారు.

# నూతన వధూవరులను ఆశీర్వదించిన బి.సి ఇందిరమ్మ

**బనగానపల్లెమేజర్,న్యూస్ః**

బనగానపల్లె పట్టణంలోని ధనలక్ష్మీ ఫంక్షన్హాల్ నందు విజయభాస్కర్ రెడ్డి, రామతులసమ్మ గార్ల ఏకైక పుత్రిక వసంత రాకేశ్వర రెడ్డిల వివాహ వేడుకకు రాష్ట్ర రోడ్లు భవనాల శాఖా మంత్రి బి.సి జనార్ధన్ రెడ్డి సతీమణి బి.సి ఇందిరమ్మ హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.



# 20న దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి

**– ఏఐటీయుసి, సీఐటీయు, ఐఎస్టీయు కార్మిక సంఘాల పిలుపు**




సమావేశంలో మాట్లాడుతున్న ఏఐటీయుసీ జిల్లా కార్యదర్శి సుంకయ్య

**నంద్యాల నూనెపల్లి, మేజర్న్యూస్ :** ఈనెల 20వ తేదీన దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెను నిర్వహిస్తున్నట్లు ఏఐటీయుసీ జిల్లా కార్యదర్శి పి.సుంకయ్య, సీఐటీయు జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ.నాగరాజులు తెలిపారు. నాలుగు లేబర్ కోడ్స్ రద్దు, కనీస వేతనం రూ.26 వేలు, ప్రభుత్వ రంగ పరిశ్రమలు ప్రైవేటీకరణ ఆపాలని, కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ రద్దు చేయాలని, కేంద్ర కార్మిక సంఘాల పిలుపు మేరకు నంద్యాల జిల్లా కేంద్రంలో ఏఐటీయుసీ ఆధ్వర్యంలో గురువారం కార్మిక సంఘాల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటీయుసీ జిల్లా కార్యదర్శి పి.సుంకయ్య, సీఐటీయు జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ.నాగరాజులు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న కార్మిక, ఉద్యోగ వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ దేశ వ్యాప్త సమ్మెకు పిలుపునిచ్చినట్లు తెలిపారు. ఈ సమ్మెను జయప్రదం కోసం ఈనెల నంద్యాల జిల్లా కేంద్రంలో జిల్లా సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అలాగే 16, 17తేదీల్లో స్కూటర్, ఆటో ర్యాలీలతో పాటు పాదయాత్రలు చేపట్టినట్లు తెలిపారు. 20వ తేదీన దేశ వ్యాప్త సమ్మెను విజయవంతం కోసం నంద్యాల జిల్లాలో అన్ని మండల, నియోజకవర్గ కేంద్రాలలో కార్మిక, ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో భారీగా ప్రదర్శనలు, సమ్మెను ఉధృతంగా నిర్వహించాలని కార్మికులకు, ఉద్యోగులకు పిలుపునిచ్చారు. తమ హక్కుల సాధన కోసం కార్మికులు ఐక్యంగా సమ్మెలో పాల్గొని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్టీయు జిల్లా కార్యదర్శి శంకర్, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్ బాబాఫకృద్దీన్, ఏఐటీయుసీ అనుబంధ కార్మిక సంఘాల నాయకులు రంజిత్, శివరాముడు, మస్తాన్, ఈశ్వరమ్మ, సుబ్బమ్మ, సీఐటీయు జిల్లా అధ్యక్షులు ఏసురత్నం, అనుబంధ సంఘ నాయకులు గౌస్, మద్దులు, ఐఎఫ్టీయు నాయకులు చౌడప్ప, తదితరులు పాల్గొన్నారు.

# బూధూరులో త్రాగునీటి కటకట

**– గత నాలుగురోజులుగా నీరు బంద్ – కాలిపోయిన విద్యుత్ మోటార్లు – పట్టించుకోని అధికారులు**

**మంత్రాలయంరూరల్, మేజర్న్యూస్ :** మంత్రాలయం మండల పరిధిలోని బుధూరు గ్రామానికి గత నాలుగు రోజుల నుంచి తాగునీటి సరఫరా నిలిచిపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నామని వాపోతున్నారు. ఈ గ్రామానికి మంత్రాలయం మండల పరిధిలోని సూగూరు ఎస్ఎస్ ట్యాంకు నుంచి తాగునీటి సరఫరా చేస్తున్నారు. ఇక్కడ ఉన్న విద్యుత్ మోటార్ కాలిపోవడంతో నీటి సరఫరా బంద్ అయింది. వేసవి కాలం కావడంతో నీటి కోసం చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులకు తెలిపిన పట్టించుకోవడం లేదని నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని వాపోయారు. ఉన్నతాధికారులు స్పందించి గ్రామానికి తాగునీరు సరఫరా చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు. ఈ విషయమై ఆర్డబ్ల్యూఎస్ఏఈ వెంకట రమణను వివరణ కోరగా, త్వరలోనే విద్యుత్ మోటార్ను మరమ్మత్తులు చేయించి నీటి సమస్యను పరిష్కరిస్తామన్నారు.



నీటితో కళకళలాడుతున్న ఎస్ఎస్ ట్యాంకు

సూర్య
www.suryaa.com
శుక్రవారం | 09 మే 2025



# కంభళదహాల్‌లో కన్నీ(టి) కష్టాలు

- నెలరోజులైన తాగునీరు నోచుకోలేని దళిత కుటుంబాలు
- పట్టించుకోని ఎంపిడిఓ, పంచాయతీ కార్యదర్శి....
- పైసలు ఇస్తేనేకొళాయి కనెక్షన్....

**పెద్దకడుబూరు మేజర్ న్యూస్ :**

కర్నూలు జిల్లా. పెద్దకడుబూరు మండల పరిధిలోని కంభళదహాల్ గ్రామంలో దళిత కాలనీ తోపాటు ఇతర కాలనీవాసులకు గత నెల రోజులు నుండి మంచి నీళ్లు నోచుకోవడం లేదు. దీంతో వారికి కన్నీటి కష్టాలు తప్పడం లేదు. గ్రామస్తులు మంచినీటి కోసం వ్యవసాయ బోర్లు బావులు చేతిపంపు బోర్లుపైనఆధార పడుతున్నామని గ్రామస్తులు తెలిపారు.గ్రామంలో రెండు ఓహెచ్ఆర్ నీటి ట్యాంకులు ఉన్నాయి. ఒక ట్యాంకులో నీరు సమృద్ధిగా ఉన్నప్పటికీ ఆ ట్యాంకు ద్వారా ఇతర బిసి కాలనీవాసుల కు సరఫరా అవుతున్నాయని చెప్పారు. అలాగే మరోక నీటి ట్యాంకు నుంచి అరకొరగా సరఫరా అవుతున్న నీరువలన దళిత కాలనీ కి నీరు సక్రమంగా సరఫరా చేయడం లేదంటున్నారు.. చేతి పంపు బోర్లులో వస్తున్న నీరు ఉప్పు గా ఉండటంవలన ఆ నీరుతాగడం లేదని స్నానం చేయాలన్న శరీరం అంత జిడ్డుగాఉంటుందనిచెప్పారు. అంతేకాకుండా ఉప్పుగా వస్తున్న నీటిని తాగలేక పోతున్నామని తెలిపారు. అలాగే పంచాయతీ కార్యదర్శి భర్త. వాటర్ మ్యాన్ జోక్యం గ్రామంలో అధిక మైయిందని గ్రామప్రజలు అంటున్నారు. అలాగే గతంలోకొస్గికివెళ్ళే రోడ్డు ప్రక్కనే మంచినీటి బోరు ద్వారా గ్రామంలోకి తాగునీరు సరఫరా చేసే వారని అయితే గత రెండేళ్లుగా బోరు మోటారు విద్యుత్ కనెక్షన్ తొలగించడం వల్ల తమకు నీటి కష్టాలు మొదలయ్యాయని గ్రామస్తులు తెలిపారు . అలాగే గ్రామంలోకి నీరు సరఫరా చేసే వాటర్ మ్యాన్. పంచాయతీ కార్యదర్శి భర్త జోక్యం వల్లనే తమకు నీటి కష్టాలు మొదలయ్యాయని గ్రామంలోని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు .అలాగే ఎమ్మిగనూరు పట్టణం నుంచి తమగ్రామంలోకి వస్తున్న ట్యాంకర్ నుంచి మంచినీళ్ళు తాగడానికి మినరల్ వాటర్ ను ఒకబిందె ధర రూ10ల నుండి రూ20లు చెల్లించి నాలుగైదు బిందె ల నీటిని కొనుగోలు చేసుకొని తాగాల్సిన పరిస్థితి ఏర్పడిందని స్థానిక ప్రజలు అంటున్నారు ఎన్నికల సమయంలో రాజకీయనాయకులు అనేక హామీలు ఇచ్చి తమచేత ఓట్లు వేయించుకొని తీరా గెలిచిన తరువాత కనీసం గ్రామం వైపు కన్నెత్తి కూడా చూడటం లేదని. తాగడానికి కనీసం మంచినీటి సౌకర్యం కూడా కల్పించడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు ప్రజాప్రతినిధులు స్పందించి గ్రామానికి మంచి నీటి సౌకర్యం కల్పించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## వ్యక్తి దారుణ హత్య



**కర్నూలు క్రైం, మేజర్‌న్యూస్ :** కర్నూలు తాలుక పోలీస్ స్టేషన్ పరిధిలోని భూపాల్ నగర్ నందు నివాసముంటున్న షేక్ రఫి(30)ని గుర్తుతెలియని వ్యక్తులు హత్య చేశారు. వివరాల మేరకు ఇలా వున్నాయి. షేక్ రఫీ గురువారం ఉదయం 10గంటలకు తనకున్న 30పశువుల(బర్రెలు)ను పడిదం పాడు పొలాల నందు మేపడానికి వెళ్లాడు. అయితే సుమారు 12.30గంటల నుండి 1.30గంటల సమయంలో రఫీ కుర్చొని ఉండగా గుర్తు తెలియని వ్యక్తులు వెనుక నుంచి వచ్చి తలపై కట్టెతో దాడి చేయగా కిందపడిపోయాడు. కిందపడిన తర్వాత రఫీ గొంతు కోసి చంపేశారు. మృతుడికి భార్య చాంద్బి, ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు వున్నారు. తాలుక ఎస్ఐ ఎన్ నరేష్ తన సిబ్బందితో కలిసి ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని తాలుక ఎస్ఐ నరేష్ తెలిపారు. అయితే రఫీ మరణానికి గల కారణాలు పాత కక్ష్యలా లేక బర్రెల లావాదేవీలా అన్నది తెలియజేయాల్సి ఉంది.

## ఘనంగా రెండవ రోజు ప్రతిష్ఠ వేడుకలు



ధ్వజస్థంబానికి పూజలు చేస్తున్న భక్తులు



కోలాటం చేస్తున్న చిన్నారులు

**కొత్తపల్లి, మేజర్‌న్యూస్ :** మండలంలోని సింగరాజుపల్లె గ్రామంలో సీతారామచంద్రస్వామి, కామాక్షి కాశీ విశ్వనాథస్వామి విగ్రహ ప్రతిష్ట ఉత్సవాలు రెండవ రోజు భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. గురువారం ఉదయం 8 గంటలకు గణపతి పూజా, దీక్షా హోమంలు నిర్వహించారు. ఆలయం వద్ద ధ్వజ స్థంబమునకు, ఉత్సవ విగ్రహాలకు అభిషేకాలు, జలాభిషేకములు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని పూజలు నిర్వహించారు. సాయంకాలం వేళలో ఉత్సవ విగ్రహాలను గ్రామంలోని పుర వీధుల గుండా ఊరేగించారు. భాజాభజంత్రిల నడుమ, సాంస్కృతిక భక్తి పాటలతో భక్త జన సందోహం మధ్య ఊరేగించారు. అనంతరం ధాన్యాదివాసం, సయ్యాది వాసం, పూష్పాదివాసం, విశేష పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొనడంతో గ్రామంలో సందడి వాతావరణం నెలకొని ఉంది.

## తేళ్ళపూరి నరసింహస్వామికీ ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎన్ఎండీ.ఫయాజ్

**నంద్యాల నూనెపల్లి, మేజర్‌న్యూస్ :** నంద్యాల నియోజకవర్గంలోని గోస్పాడు మండలం తేళ్ళపూరి గ్రామంలో వెలసిన నరసింహ స్వామి ఆలయంలో యాటగిరి నరసింహస్వామికి రాష్ట్ర యువనాయకుడు ఎన్ఎండీ ఫిరోజ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. గురువారం గోస్పాడు టీడీపీ మండల కన్వీనర్ తులసీశ్వరరెడ్డి ఆహ్వానం మేరకు ఆయన తేళ్ళపూరి గ్రామానికి వెళ్ళారు. శ్రీశ్రీ యాటగిరి నరసింహ స్వామి జీర్ణోదరణ, సంప్రోక్షణ, నూతన విగ్రహ గణపతి శివలింగ ఆంజనేయ ధ్వజస్థిర ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఎన్ఎండి ఫయాజ్ పాల్గొన్నారు. అనంతరం స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం తెలుగుదేశం పార్టీ నాయకులు ఎన్ఎండీ ఫయాజ్‌ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో తేళ్ళపూరి సర్పంచ్ సుధామణి, వి.సీతారామిరెడ్డి, ఎం.సుగాలిరెడ్డి, తిరుపాలయ్య, ఈ.పెద్ద బుజ్జి, కోటన్న, నరసింహుడు, తిరుపతి, శీను, గోస్పాడు హుసేన్, షేక్ మున్న, కామిని మల్లికార్జున, గోవిందు నాయుడు, నాగరాజు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## గ్రంథాలయంలో వేసవి శిక్షణా శిబిరం ఏర్పాటు



**సంజామలమేజర్,న్యూస్:** సంజామల మండలం గిద్దలూరు గ్రామంలోని పుస్తక నిక్షిప్త కేంద్రంలో గ్రంథాలయ నిర్వాహకులు టి. మద్దిలేటి ఆధ్వర్యంలో వేసవి శిక్షణ శిబిరం నిర్వహించడం జరిగింది. ఈ శిబిరం నందు విద్యార్థులు ఒక గంట సమయం కేటాయించినందుకు వారికి లక్కిడిప్ ద్వార పెన్ను మరియు పెన్సిల్‌ను మిద్దె కృష్ణమూర్తి అందజేయడం జరిగినది. ఈ సందర్భంగా మిద్దె కృష్ణమూర్తి మాట్లాడుతూ గ్రామానికి చెందిన విద్యార్థులు ఈ వేసవి శిక్షణా శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

## నేరగాళ్ళ ఎత్తుగడలకు సాంకేతిక పరిజ్ఞానంతో అడ్డుకట్టు

**– జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా**



శిక్షణా తరగతుల్లో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా

**నంద్యాల అర్బన్, మేజర్‌న్యూస్ :** నేరగాళ్ళ ఎత్తుగడలకు సాంకేతిక పరిజ్ఞానంతో అడ్డుకట్ట వేయవచ్చునని జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా పేర్కొన్నారు. గురువారం నంద్యాల ఎన్‌జీవోఎస్ కాలనీ – పొన్నాపురం కాలనీలోని రామకృష్ణ పీజీ కళాశాల ఆడిటోరియంలో జిల్లాలో పోరెన్సిక్ సైన్స్ ఎవిడెన్స్ మేనేజ్‌మెంట్‌పై శిక్షణా తరగతులు ఏర్పాటు చేశారు. రాష్ట్ర డీజీపీ ఆదేశాల మేరకు శిక్షణా కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్‌లోని పోలీస్ అధికారులు, స్టేషన్ రైటర్లు శిక్షణా తరగతుల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ నేరం చేసిన వ్యక్తి శిక్ష నుంచి తప్పించుకోకుండా నేర స్థలంలో సాక్షాధారాల సేకరణ, వాటి భద్రతా ప్రమాణాలు ఏలా పాటించాలో తెలియ జేశారు. కేసుల దర్యాప్తులో నేరస్తులు సాంకేతికంగా కొత్త పద్దతులను వినియోగిస్తున్న సందర్భంలో వాటిని ఎదుర్కొనేందుకు అత్యాధునిక పరిజ్ఞానాన్ని ఈ శిక్షణా తరగతుల్లో అందిపుచ్చుకోవాలని అన్నారు. పోరెన్సిక్ సైన్స్ నందు నిష్ణాతులైన వారితో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని అన్నారు. డీఎన్ఏ చేసిన, వేలిముద్రలు, రక్తపు మరకల నమూనాలు, తుపాకులు, మైక్రోస్కోప్ వంటి వాటిలో సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి సాక్షాలు సేకరించాలని అన్నారు. నేరం చేసిన వ్యక్తికి శిక్ష పడేలా ఈ శిక్షణా తరగతుల ద్వారా అట్టి పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ మందా జావళి ఆల్ఫోన్స్, ఆళ్ళగడ్డ డీఎస్పీ ప్రమోద్, పోరెన్సిక్ సైన్ అసిస్టెంట్లు డాక్టర్ ఆసీమ్ బాష, డాక్టర్ కృష్ణమోహన్‌రెడ్డి, శ్యామ్ ప్రసాద్, కుమార్‌రెడ్డిలు పాల్గొన్నారు.